టాప్ న్యూస్



## ఇందిరమ్మ పేరు పెడితే ఇళ్ళివ్వం

- మోదీ ప్రభుత్వం మంజూరు చేసే ఇండ్లకు ఇందిరమ్మ పేరా?
- కొత్త రేషన్ కార్డులపై సీఎంతో పాటు ప్రధాని ఫోటో ఉండాల్సిందే
- కేంద్రం ఉచితంగా బియ్యం ఇస్తుంది
- దావోస్ పెట్టుబడుల ఎంవోయూలన్నీ హంబక్కే
- కేంద్ర మంత్రి బండి సంజయ్

03



## ప్రగతి దిశగా భారత్ పయనం

- దేశంలో సుపరిపాలనకు వన్ నేషన్ వన్ ఎలక్షన్
- రిపబ్లిక్ డే ప్రసంగంలో రాష్ట్రపతి ముర్ము

03



## గవర్నర్ ఫోన్ ట్యాప్..! బీఆర్ఎస్‌కు కొత్త తలనొప్పి

- కొత్త మలుపు తీసుకున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం
- తెరపైకి సీబీఐకి అప్పగించాలన్న డిమాండ్

03


Follow: @ANNTELUGU

26-01-2025

ANN తెలుగు

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 55 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




కంది రామచంద్రారెడ్డి

వీకెండ్ అనాలసిస్

## దావోస్ పెట్టుబడులతో గ్రేటర్‌లో పెరిగిన సీఎం ఇమేజ్

దావోస్ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాధించిన పెట్టుబడుల విజయం రాష్ట్రప్రభుత్వానికి మైలేజీ తీసుకొచ్చింది. పెట్టుబడుల ప్రవాహంతో హైదరాబాద్ లో రేవంత్ ఇమేజ్ పెరగనుంది. గ్రేటర్ హైదరాబాద్ కు అగ్రశ్రేణి సంస్థలు వచ్చి వేలాది కోట్ల పెట్టుబడులు పెడితే ఉపాధి అవకాశాలు పెరగడంతో రాష్ట్ర ఆర్థికము ఖచిత్రం మారుతుంది. హైదరాబాద్ చుట్టూ రియల్ ఎస్టేట్ కూడా గణనీయంగా పెరుగుతుంది. హైడ్రా తర్వాత గ్రేటర్ హైదరాబాద్ లో సీఎం ఇమేజ్ పెరగ్గా, తాజా పెట్టుబడులు మంచి బూస్ట్ ను అందించాయి. గ్రామసభలు ప్రణాళిక లోపంతో గందరగోళమైనా దశాబ్దకాలం తర్వాత ఇస్తున్న రేషన్ కార్డులు సజావుగా ప్రజలకు అందితే ప్రజలు గుర్తు పెట్టుకుంటారు. సమన్వయలోపాలు అధిగమిస్తూ ప్రభుత్వం ముందడుగు వేస్తే అనుకున్న లక్ష్యాలు సాధించగలుగుతారు.

**- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సిఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ ఎనాలసిస్**

ఎడిటోరియల్ పేజీ 4లో




## ఈనో వాడండి..

# కడుపుమంట తగ్గించుకోండి

### దావోస్ పెట్టుబడులపై కాంగ్రెస్ వినూత్న కౌంటర్

కేసీఆర్, కేటీఆర్ ఫొటోలతో ఫ్లెక్లీలు.. గతంలో బీఆర్ఎస్ తరహాలోనే కౌంటర్

ఈనో వాడండి.. కడుపుమంట తగ్గించుకోండి. దావోస్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 1.79లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చినందుకు మీకు కడుపుమంట సహజం కేసీఆర్.. కేటీఆర్. ఈనో వాడండి.. కడుపుమంట తగ్గించుకోండి అంటూ హైదరాబాద్ సిటీలో భారీ హోర్డింగ్ లు, ఫ్లెక్సీలు పెట్టి బిఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ నేతలు దిమ్మతిరిగే కౌంటర్ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజయం చాటుతూనే బీఆర్ఎస్ నేతల నోర్లు మూయించేలా కొత్త స్ట్రాటజీని కాంగ్రెస్ అమలుచేసింది. గతంలో అధికారంలో ఉన్నపుడు బిఆర్ఎస్ ఇదే తరహాలో తరచూ బిజెపిని ఇరుకునపెట్టే ప్రయత్నం చేయగా, ఇపుడు కాంగ్రెస్ రేవంత్ విజయాలతో దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ చేసింది

**- మహా, హైదరాబాద్**

వివరాలు 2లో



నా ఇంట్లో రూ. 20 లక్షలు

## దొరికాయి

పంచనామా చేశారు

3న రమ్మన్నారు

ఐటీ దాడులపై ఎఫ్ డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజ


03



## యువత ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకోవాలి

- వారి భవిష్యత్తుతోనే దేశ భవిష్యత్తు
- శక్తిమంతమైన భారత్ నిర్మాణంలో విద్య కీలకం
- పేదలకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలి
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- గుజరాత్ విశ్వవిద్యాలయం 73వ స్నాతకోత్సవంలో ప్రసంగం

03




## మాజీ సీఎం కేసీఆర్ ఇంట విషాదం

- కేసీఆర్ సోదరి సకలమ్మ కన్నుమూత
- సకలమ్మ కేసీఆర్‌కు ఐదవ సోదరి

02

# నేటి నుంచి పథకాల జాతర



### నాలుగు పథకాలు ప్రారంభం..

పారదర్శక ఎంపికకు ప్రాధాన్యం

ఆలస్యమైనా అర్హులందరికీ పథకాలు అందాలి

ఎంపికలో తప్పులుండకుండా జాగ్రత్తలు

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన వెంటనే పేదలకు సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు సన్నాహకాలు చేస్తోంది. ఇప్పటికే మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు, గృహ లక్ష్మీ (ఉచిత విద్యుత్), రూ.500 గ్యాస్ సిలిండర్‌తో పాటు ఆరోగ్యశ్రీ సాయాన్ని రూ.10 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. త్వరలోనే మరో నాలుగు పథకాలను తీసుకువచ్చేందుకు రంగం సిద్ధం చేసింది తెలంగాణ సర్కార్. అందులో ప్రధానమైనవి కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకం. ఈ పథకాల అమలుకు ముహూర్తం కూడా ఫిక్స్ అయ్యింది. జనవరి 26 నుంచి ముఖ్యమైన నాలుగు పథకాలను ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేసింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాలను ప్రారంభించనున్నారు. ఇందుకోసం ఇప్పటికే గ్రామసభలు, సర్వేలు నిర్వహించిన సర్కార్.. అర్హులైన ప్రతీఒక్కరికీ పథకాలు అమలు జరిగేలా చర్యలు తీసుకుంది. అలాగే ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని ఇప్పటికే మంత్రులు స్పష్టం చేశారు.

**కొత్త రేషన్ కార్డులు**

తెలంగాణ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కొత్త రేషన్ కార్డులకు మోక్షం లభించింది. జనవరి 26న కొత్త రేషన్ కార్డులను అర్హులకు జారీ చేయనుంది సర్కార్. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో కొత్త రేషన్ కార్డులను జారీ చేయనున్నారు.

మిగతా 2లో



# 2025 పద్మాలు వీరే

### పురస్కారాలను ప్రకటించిన కేంద్రం

మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ.. డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి పద్మ విభూషణ్

సినీ నటుడు బాలకృష్ణకు పద్మభూషణ్

**న్యూఢిల్లీ:** రిపబ్లిక్ డేను పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక 'పద్మ' అవార్డులను ప్రకటించింది. 103 మందికి పద్మశ్రీ అవార్డులు, 19 మంది పద్మభూషణ్, ఏడుగిరికి పద్మవిభూషణ్ అవార్డులను ప్రకటించింది. వీరిలో 23 మంది మహిళలు, 10 మంది విదేశీయులు, 13 మందికి మరణాంతర అవార్డులు లభించాయి. కాగా అవార్డు విజేతల వివరాలు ఇలా ఉన్నాయి.

మిగతా 2లో



వందేళ్ళ అవసరాలకు అనుగుణంగా

## ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం

**నిర్మాణ నిబంధనలు పూర్తిగా పాటించాలి**

- పార్కింగ్, ఫైర్‌స్టేషన్, ఎస్టీపీ, హెలీ అంబులెన్స్ సౌకర్యాలు
- అంబులెన్స్‌లు, ఫైర్ ఇంజిన్ సులువుగా రాకపోకలు సాగించాలి
- మార్చురీ, బాడీ ఫ్రిజింగ్ విషయంలోనూ ఆధునిక పద్ధతులు
- ఆసుపత్రి నిర్మాణంపై సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- ఈ నెల 31న ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన

**హైదరాబాద్, మహా :** రానున్న వందేళ్ల అవసరాలకు తగినట్లు పూర్తి ఆధునిక వసతులతో ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించి ఏ విషయంలోనూ రాజీపడొద్దని ఆయన

మిగతా 2లో




## హైదరాబాద్‌లో టాప్-10 కుబేరులు

ఫస్ట్ దివీస్ ల్యాబ్స్ ఛైర్మన్ మురళీ దివి

లాస్ట్ బయోలాదికల్ ఇ ఛైర్మన్ మహిమా దాట్ల

వివరాలు 3లో




## 76వ గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

**ఈసారి ప్రత్యేకతలివే.. విరాసత్ ఔర్ వికాస్ ఇతివృత్తంతో ఈసారి గణతంత్ర వేడుకలు**

కర్తవ్యపథ్‌లో గణతంత్ర వేడుకలు

వివరాలు 4లో

# వందేళ్ళ అవసరాలకు అనుగుణంగా ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం



(మొదటిపేజీ తరువాయి)

అధికారులకు సూచించారు. ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి ఈ నెల 31న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రి నిర్మాణంపై తన నివాసంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రి భవన నిర్మాణాలతో పాటు బోధన సిబ్బంది, విద్యార్థి, విద్యార్థినులకు వేర్వురుగా నిర్మించే హాస్టల్ భవనాల విషయంలోనూ పూర్తి నిబంధనలు పాటించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. భవన నిర్మాణాలు, పార్కింగ్, ల్యాండ్ స్కేప్ విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సీఎం తెలిపారు. ఆసుపత్రికి రాకపోకలు సాగించేలా నలువైపులా రహదారులు ఉండాలని, అవసరమైనచోట ఇతర మార్గాలను కలిపేలా అండర్‌పాస్‌లు నిర్మించాలని సీఎం సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, సహాయకులు, పరామర్శకు వచ్చే వారి వాహనాలు నిలిపేందుకు వీలుగా అండర్‌గ్రౌండ్‌లో రెండు ఫ్లోర్లలో పార్కింగ్ ఉండాలన్నారు. డార్మిటరీ, ఫైర్ స్టేషన్, క్యాంటిన్, మూత్రశాలలు, ఎస్టీపీలు నిర్మించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పిల్లలు విదేశాల్లో స్థిరపడుతుండడంతో వారు వచ్చేందుకు రెండు మూడు రోజులు పడుతోందని, అప్పటి వరకు మృతదేహాలను భద్రపర్చేందుకు ఆధునిక సౌకర్యాలతో మార్చురీ, బాడీ ఫ్రీజింగ్ నిర్మాణాలు ఉండాలని సీఎం సూచించారు. అవయవాల మార్పిడి, అత్యవసర సమయాల్లో రోగుల తరలింపునకు వీలుగా హెలీ అంబులెన్స్‌లు వినియోగిస్తున్నందున హెలీప్యాడ్ నిర్మాణం చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఆసుపత్రిలో అడుగుపెట్టగానే ఆహ్లాదకర వాతావరణం ఉండాలని, ఆసుపత్రికి వచ్చామనే భావన ఉండకూడదని సీఎం సూచించారు. ఆసుపత్రి భవన నిర్మాణాలకు సంబంధించిన నమూనాల్లో పలు మార్పులు చేర్పులను రేవంత్ రెడ్డి సూచించారు. సమీక్షలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి సంయుక్త కార్యదర్శి సంగీత సత్యనారాయణ, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా జడ్ చోంగ్తూ, ఫ్లాగ్ షిప్ ప్రోగ్రామ్స్ కమిషనర్ శశాంక, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# దావోస్ పెట్టుబడులు చూసి కడుపుమంటా

## ఈనో ఆన్.. కడుపుమంట గాన్.. కేసీఆర్, కేటీఆర్ ఫొటోలతో ఫ్లెక్సీలు

**హైదరాబాద్, మహా :** సీఎం రేవంత్ రెడ్డి చేపట్టిన దావోస్ పర్యటన అద్భుత ఫలితాలను ఇచ్చింది. విస్తృతంగా భారీ పెట్టుబడులను సాధించింది. పలు కీలక రంగాల్లో ఆయా సంస్థలతో ప్రభుత్వం పరస్పర అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుంది. వాటి విలువ 1,78,950 కోట్ల రూపాయలు. అమెజాన్ రూ. 60,000 కోట్లు, సన్ పెట్రోకెమికల్స్ రూ. 45,500 కోట్లు, టిల్‌మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ రూ. 15,000 కోట్లు, మేఘా ఇంజినీరింగ్ రూ. 15,000 కోట్లు కంట్రోల్ ఎస్, సైఫీ, ఉర్సా క్లస్టర్స్, బ్లాక్ స్టోన్, హెచ్‌సీఎల్ టెక్ సెంటర్, విప్రో, ఇన్ఫోసిస్, హిందుస్తాన్ యూనిలివర్ వంటివి సంస్థలు తెలంగాణ ప్రభుత్వంతో ఎంఓయూలను కుదుర్చుకున్నాయి. ఐటీ, డేటా సెంటర్లు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, గ్రీన్ ఎనర్జీ, సోలార్, రాకెట్ తయారీ, ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటీరియర్స్ డిజైన్, యూఏవీ తయారీ,




పామాయిల్ రిఫైనరీ యూనిట్‌కు సంబంధించిన పెట్టుబడులు ఉన్నాయి. ఇవన్నీ కార్యరూపం దాల్చితే హైదరాబాద్ అతిపెద్ద హబ్‌గా మారుతుందనడంలో సందేహం అక్కర్లేదు. ఈ దావోస్ పర్యటన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అతిపెద్ద బూస్ట్ ఇచ్చినట్లైంది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన రెండో సంవత్సరంలోనే ఈ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించడం పట్ల ముఖ్యమంత్రి తన సత్తా ఏమిటో నిరూపించుకున్నట్లైంది. ఏపీతో పోల్చుకుంటే తెలంగాణే 1.78 లక్షల కోట్ల రూపాయల విలువ చేసే పెట్టుబడులు, 49,500 ఉద్యోగాలను సాధించినట్లయింది. ఇది అటు రాజకీయంగా కాంగ్రెస్ పార్టీకి ప్లస్ పాయింట్ అయింది. బీజేపీ పాలిత రాష్ట్రాలతో పోల్చుకుంటే మహారాష్ట్ర తరువాత ఈ స్థాయిలో పెట్టుబడులను సాధించడాన్ని వినియోగించుకుంటోంది. దావోస్ పెట్టుబడులు ఇచ్చిన ఊపుతో ప్రత్యర్థులపై కాంగ్రెస్ రాజకీయ దాడి మొదలు పెట్టింది. భారత రాష్ట్ర సమితిపై వినూత్నంగా వార్‌కు దిగింది. ఈ క్రమంలో మాజీ ముఖ్యమంత్రి కేటీఆర్, మాజీ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌పై సెటైరికల్ ఫ్లెక్సీలు, హోర్డింగులు హైదరాబాద్‌లో విస్తృతంగా వెలిశాయి. పెట్టబడులు చూసి కడుపుమంటా..? వాడండి ఈనో, ఈనో ఆన్ కడుపుమంట గాన్ అంటూ కేసీఆర్, కేటీఆర్ ఫొటోలను వాటిపై ముద్రించి ఉన్నాయి.

# నేటి నుంచి పథకాల జాతర



(మొదటిపేజీ తరువాయి)

ఇందు కోసం ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామ సభల్లో కొత్త రేషన్ కార్డులు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది సర్కార్. దీంతో అనేక మంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటితో పాటు పాత రేషన్ కార్డు మార్పులు, చేర్పులు కూడా చేయనున్నారు. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం అర్హులైన అందరికీ ఆహార భద్రతా కార్డులను అందించనుంది సర్కార్.

**రైతు భరోసా**

ఈనెల 26 నుంచి తెలంగాణ రాష్ట్రంలోని రైతులకు రైతు భరోసా అందించాలని సర్కార్ నిర్ణయించింది. సాగుకు అనుకూలమైన భూములకు మాత్రమే పెట్టుబడి సాయం కింద ఏడాదికి ఒక్కో ఎకరానికి రూ.12 వేలు అందించనుంది. ఇందుకోసం ఈనెల 20 వరకు సర్వే నిర్వహించిన అధికారులు సాగుకు అనుకూలం కాని భూముల లిస్టును గ్రామ పంచాయతీల్లో ఉంచారు. నేటి నుంచి రేపు రైతు భరోసాకు అర్హులైన వారి ఖాతాల్లోకి డబ్బులు జమకానున్నాయి.

**ఇందిరమ్మ ఆత్మీయ భరోసా**

రాష్ట్రంలో భూమి లేని రైతు కూలీలకు ఏడాదికి రెండు విడతల్లో రూ.12 వేలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్క గుంట కూడా భూమి లేని నిరుపేదలు ఈ పథకానికి అర్హులుగా ఉండనున్నారు. ఈ పథకం కూడా నేటి నుంచి మొదలు కానుంది.

**ఇందిరమ్మ ఇళ్ల పథకం..**

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం మొత్తం 80.54 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల కోసం క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 10.72 లక్షల దరఖాస్తులు రాగా.. ఇప్పటి వరకు 7.80 లక్షల దరఖాస్తుల ప్రక్రియ పూర్తయినట్లు తెలుస్తోంది. మిగిలిన దరఖాస్తుల పరిశీలనకు మరో వారం రోజు సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల కోసం పలు విడతల్లో రూ.5 లక్షలు ఇవ్వనుంది.

# పండగలా పథకాల జాతర

## సర్వం సిద్ధం చేసిన అధికార యంత్రాంగం

### రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమం.. మహబూబ్ నగర్‌లో సీఎం రేవంత్ ప్రారంభం

### షాద్ నగర్‌లో హాజరు కానున్న టీ పీసీసీ చీఫ్

**హైదరాబాద్, మహా :** ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు కాంగ్రెస్ పార్టీ సన్నద్ధమైంది. అధఇకారంలోకి వచ్చినప్పటి నుంచి హామీల అమలుకు చేస్తున్న ప్రయత్నాలకు ఎదురవుతున్న అడ్డంకులను ఒక్కొక్కటిగా అధిగమించి కీలకమైన హామీల అమలుకు సన్నద్ధమైంది. అత్యంత ప్రతిష్టాత్మక రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను రాష్ట్రంలోని ప్రతీ మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి అర్హులైన వారందరికీ అందించాలని నిర్ణయించింది. జాతీయ పర్వదినమైన గణతంత్ర దినోత్సవం నాడు ఈ పథకాలను ప్రారంభిస్తున్న నేపథ్యంలో వాడవాడలా కాంగ్రెస్ శ్రేణులు పండగలా కార్యక్రమాల అమలు కోసం ఏర్పాట్లను చేస్తున్నారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామంలో ఈ నాలుగు పథకాలను అర్హులైన లబ్దిదారులందరికీ అందించాలని నిర్ణయించిన నేపథ్యంలో నేతలందరూ పథకాల ప్రోరంభోత్సవంలో పాల్గొనేందుకు సన్నద్ధమయ్యారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఈ పథకాల పండుగను ప్రారంభించనున్నారు. నాలుగు పథకాలకు గాను రేషన్ కార్డులకు సంబంధించి తహసీల్దార్ నేతృత్వంలో ప్రత్యేక టీమ్, ఇందిరమ్మ ఇండ్లకు గాని ఎండీఓ ఆధ్వర్యంలో, రైతు భరోసాకు మండల వ్యవసాయ అధికారి, డిప్యూటీ తహసీల్దార్ లేదా రెవెన్యూ ఇన్స్పెక్టర్ టీమ్, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఉపాధి హామీ పథకం ఏపీఓ టీమ్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించిన ప్రభుత్వం పథకాల ప్రారంభోత్సవ ఏర్పాట్లు శనివారం సాయంత్రం నుంచే మొదలు పెట్టారు. ఈ పథకాల



ప్రారంభోత్సవ కార్యక్రమం పండగ వాతావరణంలో నిర్వహించాలని సంకల్పించండతో పాటు పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టేందుకు కావాల్సిన మార్గదర్శకాలను కూడా కింది స్థాయి అధికారులకు జారీ చేశారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను గ్రామ సభల ద్వారా ఖరారు చేశారు. ఈ సభకు లబ్దిదారులందరూ హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతీ పథకానికి సంబంధించి లబ్ధిదారుల జాబితాను ఈ గ్రామ సభలో ప్రముఖంగా ప్రదర్శించాలని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రారంభించే ప్రతీ గ్రామానికి మండల స్పెషల్ అధికారి ఇంచార్జిగా నియమించారు. జిల్లా కలెక్టర్లు అర్హుల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించారు. మహబూబ్ నగర్ జిల్లాలో నాలుగు పథకాలను సీఎం తేవంత్ రెడ్డి ప్రారంభించనుండగా, షాద్ నగర్ లో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రారంభించనున్నారు. ఇదే తరహాలో నియోజకవర్గాల వారిగా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నేతలు, ప్రజా ప్రతినిధులు హాజరు కానున్నారు.

# 2025 పద్మాలు వీరే



## పురస్కారాలను ప్రకటించిన కేంద్రం

### మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ.. డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి పద్మ విభూషణ్

### సినీ నటుడు బాలకృష్ణకు పద్మభూషణ్

**పద్మశ్రీ అవార్డులు..**

అచ్యుత్ రాంచంద్ర పాలవ్ - కళలు - మహారాష్ట్ర
అజయ్ వి భట్ - శాస్త్రం మరియు ఇంజనీరింగ్ - సంయుక్త రాష్ట్రాలు
అనిల్ కుమార్ బోరో - సాహిత్యం, విద్య - అసోం
అరిజిత్ సింగ్ - కళలు - పశ్చిమ బెంగాల్
శ్రీమతి అరుంధతి భటాచార్య - వాణిజ్యం, పరిశ్రమ - మహారాష్ట్ర
అరణోదయ్ సాహా - సాహిత్యం, విద్య - త్రిపుర
అరవింద్ శర్మ - సాహిత్యము, విద్య - కెనడా
ఆశోక్ కుమార్ మహపాత్ర - వైద్య రంగం - ఒడిశా
ఆశోక్ లక్ష్మణ్ సరాఫ్ - కళలు - మహారాష్ట్ర
ఆశుతోష్ శర్మ - శాస్త్రం, ఇంజనీరింగ్ - ఉత్తర ప్రదేశ్
శ్రీమతి ఆశ్విని భిడి దేశ్‌పాండి - కళలు - మహారాష్ట్ర
బైజనాథ్ మహరాజ్ - ఇతరులు - ఆధ్యాత్మికత - రాజస్థాన్
బారీ గాడ్రే జాన్ - కళలు - ఢిల్లీ
శ్రీమతి బేగమ్ బతూల్ - కళలు - రాజస్థాన్
భారత్ గుప్త - కళలు - ఢిల్లీ
భేరు సింగ్ చౌహాన్ - కళలు - మధ్యప్రదేశ్
భీమ్ సింగ్ భవేశ్ - సామాజిక సేవ - బిహార్
శ్రీమతి భీమవ్వ డోడబలప్ప - కళలు - కర్ణాటక
బుధేంద్ర కుమార్ జైన్ - వైద్య రంగం - మధ్యప్రదేశ్
సి.ఎస్. వైద్యనాథన్ - ప్రజా వ్యవహారాలు - ఢిల్లీ
చైత్రమ్ డీఓచంద్ పావర్ - సామాజిక సేవ - మహారాష్ట్ర
చంద్రకాంత్ శెత్ (మరణాంతరం) - సాహిత్యము మరియు విద్య - గుజరాత్
చంద్రకాంత్ సోంపూర - ఇతరులు - వాస్తు శిల్పం - గుజరాత్
చేతన్ ఈ చిట్నిస్ - శాస్త్రం, ఇంజనీరింగ్ - ఫ్రాన్స్
డేవిడ్ ఆర్ సియెమ్‌లిహ్ - సాహిత్యం, విద్య - మెఘాలయ
దుర్గా చరణ్ రాంబీర్ - కళలు - ఒడిశా
ఫరూఖ్ అహ్మద్ మిర్ - కళలు - జమ్మూ అండ్ కశ్మీర్
గణేశ్వర్ శాస్త్రి ద్రవిడ - సాహిత్యం, విద్య - ఉత్తర ప్రదేశ్
శ్రీమతి గీత ఉపాధ్యాయ - సాహిత్యం, విద్య - అసోం
గోకుల్ చంద్ర దాస్ - కళలు - పశ్చిమ బెంగాల్
గురువాయూర్ దొరై - కళలు - తమిళనాడు
హర్చందన్ సింగ్ భట్టి - కళలు - మధ్యప్రదేశ్
హరిమాన్ శర్మ - ఇతరులు - వ్యవసాయం - హిమాచల్ ప్రదేశ్
హర్జిందర్ సింగ్ శ్రీనగర్ వాలే - కళలు - పంజాబ్
హర్విందర్ సింగ్ - క్రీడలు - హర్యానా
హస్సన్ రాఘు - కళలు - కర్ణాటక
హేమంత్ కుమార్ - వైద్య రంగం - బిహార్
హృదయనారాయణ్ దీక్షిత్ - సాహిత్యం, విద్య - ఉత్తర ప్రదేశ్
హ్యూగ్ మరియు కాలిన్ గాంట్జర్ (మరణాంతరం అవార్డు) (ద్వయం) - సాహిత్యం, విద్య - జర్నలిజం - ఉత్తరాఖండ్
ఇనివలప్పిల్ మణి విజయన్ - క్రీడలు - కేరళ
జగదీష్ జోషిలా - సాహిత్యం, విద్య - మధ్యప్రదేశ్
శ్రీమతి జస్పిందర్ నరుల - కళలు - మహారాష్ట్ర
జోనస్ మసెట్టీ - ఇతరులు - ఆధ్యాత్మికత - బ్రెజిల్
జోయనాచరణ్ బాథరి - కళలు - అసోం
శ్రీమతి జుంబె యోమ్‌గామ్ గామ్లిన్ - సామాజిక సేవ - అరుణాచల్ ప్రదేశ్
కె. దామోదరన్ - ఇతరులు - వంటకళలు - తమిళనాడు
కే ఎల్ కృష్ణ - సాహిత్యం, విద్య - ఆంధ్రప్రదేశ్
శ్రీమతి కే ఓమనకుట్టి అమ్మ - కళలు - కేరళ
కిశోర్ కునాల్ (పోస్టుహమస్) - సివిల్ సర్వీస్ - బిహార్
ఎల్ హాంగ్తింగ్ - ఇతరులు - వ్యవసాయం - నాగాలాండ్
లక్ష్మిపతి రామసుబ్బయ్యర్ - సాహిత్యం, విద్య - జర్నలిజం - తమిళనాడు
లలిత్ కుమార్ మంగోత్రా - సాహిత్యం, విద్య - జమ్మూ అండ్ కశ్మీర్
లామ (పోస్టుహమస్) - ఇతరులు - ఆధ్యాత్మికత - లడాఖ్
శ్రీమతి లిబియా లోబో సర్దేసాయ్ - సామాజిక సేవ - గోవా
ఎమ్.డి. శ్రీనివాస్ - శాస్త్రం, ఇంజనీరింగ్ - తమిళనాడు
మడుగుల నాగఫణి శర్మ - కళలు - ఆంధ్రప్రదేశ్
మహాబీర్ నాయక్ - కళలు - ఝూర్ఖండ్
శ్రీమతి మమతా శంకర్ - కళలు - పశ్చిమ బెంగాల్
మంద క్రిష్ణమమాదిగ - ప్రజా వ్యవహారాలు - తెలంగాణ
మారుతి భుజంగ్రావ్ చితంపల్లి - సాహిత్యం, మరియు విద్య - మహారాష్ట్ర
మిరియాల అప్పారావు (మరణాంతరం) - కళలు - ఆంధ్రప్రదేశ్
నాగేంద్ర నాథ్ రాయ్ - సాహిత్యం, విద్య - పశ్చిమ బెంగాల్
నారాయణ్ (భులాయి భాయి) (మరణాంతరం) - ప్రజా వ్యవహారాలు - ఉత్తర ప్రదేశ్

**పద్మ భూషణ్..**

ఎ. సూర్య ప్రకాశ్ - సాహిత్యం, విద్య - జర్నలిజం - కర్ణాటక
ఆనంద్ నాగ్ - కళలు - కర్ణాటక
బిబేక్ దేవ్రోయ్ (మరణాంతరం) - సాహిత్యం, విద్య - ఢిల్లీ
జతిన్ గోస్వామి - కళలు - అసోం
జోస్ చాకో పెరియప్పురం - వైద్య రంగం - కేరళ
కైలాష్ నాథ్ దీక్షిత్ - ఇతరులు - పురావస్తు శాస్త్రం - ఢిల్లీ
మనోహర్ జోషి (మరణాంతరం) - ప్రజా వ్యవహారాలు - మహారాష్ట్ర
నళ్ళి కుప్పస్వామి చెట్టి - వాణిజ్యం, పరిశ్రమ - తమిళనాడు
నందమూరి బాలకృష్ణ - కళలు - ఆంధ్రప్రదేశ్
పి.ఆర్. శ్రీజేష్ - క్రీడలు - కేరళ
పంకజ్ పటేల్ - వాణిజ్యం, పరిశ్రమ - గుజరాత్
పంకజ్ ఉదాస్ (మరణాంతరం) - కళలు - మహారాష్ట్ర
రాంబహదూర్ రాయ్ - సాహిత్యం, విద్య - జర్నలిజం - ఉత్తర ప్రదేశ్
సాధ్వి రీతాంభరా - సామాజిక సేవ - ఉత్తర ప్రదేశ్
ఎస్. అజిత్ కుమార్ - కళలు - తమిళనాడు
శేఖర్ కపూర్ - కళలు - మహారాష్ట్ర
శ్రీమతి శోబనా చంద్రకుమార్ - కళలు - తమిళనాడు
సుషిల్ కుమార్ మోడి (మరణాంతరం) - ప్రజా వ్యవహారాలు - బిహార్
వినోద్ ధామ్ - శాస్త్రం, ఇంజనీరింగ్ - యునైటెడ్ స్టేట్స్

**పద్మ విభూషణ్ అవార్డులు..**

దువ్వూరు నాగేశ్వర్ రెడ్డి - వైద్య రంగం - తెలంగాణ
జస్టిస్ (పెన్షన్) శ్రీ జగదీష్ సింగ్ ఖేహర్ - ప్రజా వ్యవహారాలు - చండీగఢ్
శ్రీమతి కుముదిని రాజనికాంత్ లఖియా - కళలు - గుజరాత్
లక్ష్మీనారాయణ సుబ్రహ్మణ్యం - కళలు - కర్ణాటక
ఎం. టీ. వాసుదేవన్ నాయర్ (మరణాంతరం) - సాహిత్యం, విద్య - కేరళ
ఒసాము సుజుకి (మరణాంతరం) - వాణిజ్యం, పరిశ్రమ - జపాన్
శ్రీమతి శారదా సింహా (పోస్టుహమస్) - కళలు - బిహార్

# ఒక్క ప్రహరీ కూల్చివేత

## 20 కాలనీలకు తొలగిన ఇబ్బంది.. సీఎం రేవంత్, హైడ్రా ఫ్లెక్సీలకు పాలాభిషేకాలు

**హైదరాబాద్, మహా :** చెరువులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణే కాదు ప్రజలకు నష్టాన్ని చేకూర్చేలా రహదారులను ఆక్రమించినా బుల్డోజర్లతో హైడ్రా విరుచుకుపడుతోంది. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలో రహదారులను ఆక్రమించి అక్రమంగా నిర్మించిన 4 కిలోమీటర్ల ప్రహరీగోడను హైడ్రా శనివారం కూల్చేసింది. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లి వద్ద ప్రముఖ విద్యావేత్త నల్ల మల్లారెడ్డికి చెందిన దివ్యానగర్ లేఔట్ చుట్టూ అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడపై హైడ్రాకు ఫిర్యాదులు వచ్చాయి. ఉదయం అక్కడికి చేరుకున్న హైడ్రా సిబ్బంది కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు రహదారికి అడ్డుగా ఉన్న ప్రహరీతో పాటు ఇతర నిర్మాణాలను నేలపట్టం చేశారు. దీంతో లేఔట్ ప్లాట్ల యజమానులు, కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. ఈ ప్రహరీ కూల్చివేతతో ఏకశిల లేఔట్, వెంకటాద్రి టౌన్‌షిప్, సుప్రభాత్ వెంచర్ 1, మహేశ్వరి కాలనీ, కాచవాణి సింగారం, ఏకశిల పీర్జాదిగూడ రోడ్డు, బాలాజీనగర్, సుప్రభాత్ వెంచర్ 4 , వీజీహెచ్ కాలనీ, ప్రతాప్ సింగారం రోడ్డు, సుప్రభాత్ వెంచర్ 2, 3, సాయిప్రియ, మేడిపల్లి, కొర్రెముల, వెంకటాపురం, పర్వాతపురం, చెన్నారెడ్డి కాలనీ, హిల్స్ వ్యూ కాలనీ, ముత్తెల్లిగూడకు వెళ్లేందుకు మార్గం సుగమమైంది. ఈ లేఔట్ ప్రహరీ వల్ల చుట్టు పక్కల ప్రజలతో పాటు అందులో ప్లాట్లు కొనుగోలు చేసిన సింగరేణి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఇటీవల హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు.

పరిశీలించిన రంగనాథ్ జనవరి 8న క్షేత్ర స్థాయిలో పరిస్థితిని సమీక్షించారు. జనవరి 23న హైడ్రా ప్రధాన కార్యాలయంలో నల్ల మల్లారెడ్డితో పాటు బాధిత ప్రజలతో ప్రత్యేకంగా సమావేశమై నిజానిజాలు తేల్చారు. దివ్యానగర్ లేఔట్ మొత్తం విస్తీర్ణం 200 ఎకరాల వరకూ ఉంటుందని, అందులో 2218 ప్లాట్లు చేయగా వెయ్యి మంది వరకు సింగరేణి ఉద్యోగులు ప్లాట్లను కొనుగోలు చేశారు. మిగతా 30 శాతం ప్లాట్లు నల్ల మల్లారెడ్డి వేనని, సర్వే నెంబరు 66లో 6.06 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా నల్ల మల్లారెడ్డి కబ్జాచేశారని స్థానికులు కమిషనర్‌కు వివరించారు. లేఔట్లలో 40 అడుగులు, 50 అడుగులు, 25 అడుగులు రహదారులు మూసివేసి అడ్డంగా గేట్లు పెట్టారని, భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసి తమ లేఔట్లలోకి రానివ్వడం లేదని సింగరేణి ఉద్యోగులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా అవసరానికి తమ ప్లాట్లు కూడా అమ్ముకోలేని పరిస్థితి ఉందని, ఒకవేళ అమ్మినా నల్ల మల్లారెడ్డి చెప్పిన ధరకే విక్రయించాలని, ఎదురు తిరిగితే దాడులు చేస్తున్నారని, లేఔట్ డెవలప్ మెంట్ ఛార్జీల పేరిట డబ్బులు వసూలు చేశారని హైడ్రా ముందు వాపోయారు. నల్ల మల్లారెడ్డిపై ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్థానిక రెవెన్యూ, మున్సిపల్ అధికారులను నిజాలు తేల్చాలని ఆదేశించారు. వారి పరిశీలనలో ప్రహరీ గోడ నిర్మాణానికి అనుమతులు లేవని నిర్ధారించడంతో కూల్చివేయాలని కమిషనర్ రంగనాథ్ ఆదేశించారు. కూల్చివేత సమయంలో నల్ల మల్లారెడ్డి వర్గానికి, కాలనీ వాసులకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని రెండు వర్గాలను చెదరగొట్టారు. మరోవైపు నల్ల మల్లారెడ్డి వ్యవహారంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ఎంఆర్ సెక్యూరిటీ పేరుతో ప్లాట్ల చుట్టూ గోడను నిర్మించి రియల్ ఎస్టేట్ మాఫియాను నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. ఆయన ప్రభుత్వ భూమిని కబ్జా చేశారనే ఫిర్యాదుపై విచారణ కొనసాగుతుందని స్పష్టం చేశారు. విచారణ పూర్తైన తర్వాత సంబంధిత అధికారులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రంగనాథ్ తెలిపారు.

# మాజీ సీఎం కేసీఆర్ ఇంట విషాదం

**హైదరాబాద్, మహా :** మాజీ సీఎం కేసీఆర్ ఐదవ సోదరి చీటి సకలమ్మ కన్నుమూశారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చనిపోయారు. కొంతకాలంగా వయోభారం, అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. సకలమ్మ మరణంతో సోదరుడు కేసీఆర్‌తో పాటు ఆయన కుటుంబం విషాదంలో ఉంది. కేసీఆర్‌కు సకలమ్మ ఐదవ సోదరి. ఆమె మరణంపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ నేతలు సంతాపాన్ని తెలిపారు. సకలమ్మ మరణవార్త తెలుసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి హరీశ్‌రావు హుటాహుటిన ఆస్పత్రికి వెళ్లారు.

## కీలక భేటీ వాయిదా

మరోవైపు బీఆర్ఎస్ కీలక సమావేశాన్ని వాయిదా వేశారు. శనివారం హైదరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతో పాటు ఇతర ముఖ్య నాయకులతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ కావాల్సి ఉంది. కేసీఆర్ సోదరి సకలమ్మ మృతితో ఈ సమావేశం వాయిదా వేశారు, సకలమ్మది రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పెదిర. సకలమ్మ భర్త హన్మంతరావు కొన్నేళ్ల క్రితం మృతిచెందారు. సకలమ్మ, హన్మంతరావు దంపతలుకు ముగ్గురు కుమారులు ఉన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మొత్తం 10 మంది తోబుట్టువులు ఉన్నారు. వీరిలో 8 మంది అక్కలు, ఒక అన్న, ఒక చెల్లి ఉన్నారు. 2018లో కేసీఆర్ రెండో సోదరి విమలాబాయి, మరో సోదరి లీలమ్మలు చనిపోయారు. అంతేకాదు ప్రతి ఏటా కేసీఆర్‌కు అక్కలు, చెల్లి రాఖీ కట్టడం ఆనవాయితీగా వస్తోంది.

## నా ఇంట్లో రూ. 20 లక్షలు దొరికాయి

### పంచనామా చేశారు.. 3న రమ్మన్నారు

### ఐటీ దాడులపై ఎఫ్ డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజు



**హైదరాబాద్, మహా :** తన ఇళ్లు, కార్యాలయాలపై జరిగిన ఆదాయపు పన్ను అధికారుల దాడులపై ప్రముఖ నిర్మాత, తెలంగాణ చలన చిత్ర సమాఖ్య అభివృద్ధి సంస్థ ఛైర్మన్ దిల్ రాజు స్పందించారు. ఆయన నిర్మించిన రెండు భారీ బడ్జెట్ సినిమాలు గేమ్ ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం మూడు రోజుల వ్యవధిలో విడుదల కావడం, అదే స్థాయిలో కలెక్షన్లను రాబట్టుకున్నాయంటూ ప్రకటనలు ఇవ్వడం ఈ దాడులకు కారణం అయ్యాయనే వాదన ఉంది. వీటిపై దిల్ రాజు విలేకరులతో మాట్లాడుతూ, ఐటీ దాడులు జరిగిన సమయంలో ఇంట్లో 20 లక్షల రూపాయల లోపు మాత్రమే నగదు మొత్తం ఉందని అన్నారు. ఈ మొత్తంలో తన వద్ద ఉన్నది అయిదు లక్షల రూపాయలేనని వివరించారు. శిరీష్ వద్ద రూ.4.5 లక్షలు, కూతురి వద్ద రూ.6 లక్షలు, ఆఫీస్‌లో 2.5 లక్షల రూపాయలు ఉన్నట్లు ఐటీ అధికారులు గుర్తించారని తెలిపారు. ఐటీ దాడుల సందర్భంగా ఐటీ అధికారులు ఇంట్లో స్థిర, చరాస్తులపై పంచనామా నిర్వహించారని వెల్లడించారు. దీనికి సంబంధించిన డాక్యుమెంట్లను తన చేతికి అందజేశారన్నారు. వాటిని విలేకరుల సమావేశంలో చూపించారు. ఈ అయిదు సంవత్సరాల కాలంలో తాము ఎలాంటి ఆస్తులను కొనుగోలు చేయలేదని వివరించారు. డాక్యుమెంట్ల పరిశీలన సందర్భంగా ఐటీ అధికారులు ఈ విషయాన్ని నిర్ధారించుకున్నారని దిల్ రాజు పేర్కొన్నారు. సంబంధిత శాఖ వద్దకు వెళ్లి తమ అనుమానాలను నివృత్తి చేసుకున్నారని దిల్ రాజు చెప్పారు. హైదరాబాద్‌లో కొన్ని ప్రైవేట్ సంస్థలు, ఇతర ప్రముఖుల ఇళ్లు, కార్యాలయాలపైనా ఐటీ దాడులు జరుగుతున్నప్పటికీ మీడియా ఫోకస్ మొత్తం తన మీదే ఉందని దిల్ రాజు గుర్తు చేశారు. సెలెబ్రిటీని కావడం వల్ల తనపై జరిగిన ఐటీ సోదాలు, తనిఖీలకు మీడియా అధిక ప్రాధాన్యత ఇచ్చిందని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో వాస్తవ పరిస్థితులు ఏమిటనేది తెలియజేయడానికే ప్రెస్ మీట్ పెట్టానన్నారు. ఫిబ్రవరి 3వ తేదీన తమను కలవాలంటూ ఐటీ అధికారులు ఆదేశించారని, తన ఆడిటర్లు వెళ్లి వాళ్లను కలుస్తారని దిల్ రాజు చెప్పారు. వ్యాపార రంగంలో కొనసాగుతున్నప్పుడు ఐటీ అధికారుల తనిఖీలు సాధారణమేనని చెప్పారు. తనిఖీల సందర్భంగా తమ వద్ద ఉన్న అకౌంట్ బుక్స్‌ను చెక్ చేశారని, స్టేట్‌మెంట్ నమోదు చేశారని దిల్ రాజు వివరించారు. ఆర్థిక లావాదేవీల గురించి ఆరా తీశారని పేర్కొన్నారు.

## యువత ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకోవాలి

### వారి భవిష్యత్తుతోనే దేశ భవిష్యత్తు.. శక్తిమంతమైన భారత్ నిర్మాణంలో విద్య కీలకం

### పేదలకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలి.. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

### గుజరాత్ విశ్వవిద్యాలయం 73వ స్నాతకోత్సవంలో ప్రసంగం




**అహ్మదాబాద్, మహా :** యువతరం ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకోవాలని, వారి భవిష్యత్తు కోసం, దేశ భవిష్యత్తు కోసం అంకిత భావంతో కష్టపడి పనిచేయాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు చెప్పారు. శుక్రవారం వెంకయ్య నాయుడు గుజరాత్ విశ్వవిద్యాలయంలో జరిగిన 73వ స్నాతకోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కష్టపడి పని చేస్తే విజయం దానంతట అదే వరిస్తుంది. మార్పునకు చోదక శక్తి యువతే. వారి భుజాలపైనే భారతదేశ భవిష్యత్తు నిర్మితమవుతుంది. అదే సమయంలో దేశ భవిష్యత్తు తో యువత భవిష్యత్తు ముడిపడి ఉంది. మంచి భవిష్యత్తును నిర్మించుకున్న తర్వాత, తమను ఇంతటి వారిని చేసిన సమాజానికి తిరిగి ఇవ్వటం అలవాటు చేసుకోవాలి. అని చెప్పారు విజ్ఞానమే అసలైన సంపద. మీ భవిష్యత్తు మీరు సంపాదించుకునే విజ్ఞాన సంపదపైనే నిర్మితమవుతుంది. దేశ నిర్మాణంలో విద్య పాత్ర చాలా కీలకం. అని పేర్కొన్నారు. దేశ జనాభాలో 50 శాతం 30 ఏళ్ల లోపు వారేనని, 35 ఏళ్ల లోపు వారు 65 శాతానికి పైగా ఉన్నారని వివరించారు. ఇది మన బలమని, ఎక్కువమంది మానవ వనరులతో ప్రపంచానికి మన దేశం ప్రతిభావంతుల కర్మాగారం కాబోతోందన్నారు. యువతరం ప్రతిభను, వారి శక్తిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోగలిగితే భారత్ త్వరలోనే మరింత శక్తిమంతమైన దేశంగా అవతరిస్తుందని పేర్కొన్నారు. ఇందుకు కీలకమైన ప్రేరకం విద్య అని వెంకయ్య నాయుడు చెప్పారు. నాణ్యమైన విద్య అందరికీ సమానంగా అందాలన్నారు. పేదలకు, గ్రామీణ ప్రజలకు నాణ్యమైన విద్యను వారు భరించగలిగే రుసుములకే అందించాలని స్పష్టం చేశారు. పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయ దార్శనికతకు అనుగుణంగా సామాజికంగా, ఆర్థికంగా అట్టడుగున ఉన్నవారికి కూడా విద్య, వైద్యం అందుబాటులో ఉండాలన్నారు. వ్యక్తిత్వ వికాసంలో శారీరక ఆరోగ్యం కూడా చాలా ముఖ్యమని వెంకయ్య నాయుడు చెప్పారు. రోజువారి జీవితంలో యోగ, వ్యాయామాలను భాగంగా చేసుకోవాలని, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు ఉండాలని విద్యార్థులకు సూచించారు. శరీరం ఆరోగ్యంగా ఉంటే మనసు, మనసు ఆరోగ్యంగా ఉంటే శరీరము ఆరోగ్యంగా ఉంటాయని చెప్పారు. ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ లను వదిలి భారతీయ సంప్రదాయ వంటకాలను ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గుజరాత్ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ నీరజ్ గుప్తా తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## హైదరాబాద్‌లో టాప్-10 కుబేరులు

### ఫస్ట్ దివీస్ ల్యాబ్స్ ఛైర్మన్ మురళీ దివి

### లాస్ట్ బయోలాజికల్ ఇ ఛైర్మన్ మహిమా దాట్ల




**మహా :** భాగ్యనగరంలో భాగ్యవంతుల జాబితా రోజు రోజుకు పెరిగిపోతోంది. ప్రస్తుతం నగరంలో టాప్ 10 కోటీశ్వరులు ఎవరు మంది హైదరాబాద్ లోనే ఉన్నారు. ఎక్కువమంది కోటీశ్వరులు నివసిస్తున్న నగరాల్లో హైదరాబాద్ దేశంలోనే మూడవ స్థానంలో నిలబడింది. దేశంలో ధనవంతులు అంటే అంబానీ, అదానీ, ప్రపంచంలో ధనవంతులంటే ఎలాన్ మస్క్, జెఫ్ బెజోస్ లాంటి పేర్లు చెబుతాం. కానీ మన తెలుగులో కూడా బిలియనీర్లున్నారు. చిన్నస్థాయిలో తమ వ్యాపారాన్ని ప్రారంభించి అతి పెద్ద వ్యాపార సామ్రాజ్యంగా మార్చినవారు చాలామంది ఉన్నవారు. వారిలో టాప్ 10లో ఉన్నవారి వివరాలు... దివీస్ లేబరేటరీస్ ఛైర్మన్ మురళి దివి ప్రథమస్థానంలో నిలిచారు. ఆయన నికర ఆస్తుల విలువ రూ. 76,100 కోట్లుగా ఉంది. పదో స్థానంలో బయోలాజికల్ ఇ చైర్ పర్సన్ మహిమ దాట్ల రూ. 13,600 కోట్లతో నిలిచారు. హైదరాబాద్‌లో టాప్10 ధనవంతులు... దివీస్ లేబొరేటరీస్ మురళి దివి రూ.76,100 కోట్లు, మేఘా ఇంజనీరింగ్ పి.పిచ్చిరెడ్డి రూ.54,800 కోట్లు, మేఘా ఇంజనీరింగ్ పి.వి.కృష్ణారెడ్డి రూ.52,700 కోట్లు, హెటెరో లాబ్స్ బి.పార్థసారధి రెడ్డి రూ. 29,900 కోట్లు, అపర్ణ కన్ స్ట్రక్షన్స్ ఎస్.సుబ్రమణ్యంరెడ్డి రూ.22,100 కోట్లు, అపర్ణ కన్ స్ట్రక్షన్స్ సి.వెంకటేశ్వరరెడ్డి రూ.21,900 కోట్లు, ఎంఎస్ఎన్ ల్యాబ్స్ ఎం. సత్యనారాయణరెడ్డి రూ.18,500 కోట్లు, మైహోం ఇండస్ట్రీస్ జూపల్లి రామేశ్వరరావు రూ. 18,400 కోట్లు, డాక్టర్ రెడ్డీస్ కె.సతీష్ రెడ్డి రూ. 18,100 కోట్లు, బయోలాజికల్ ఇ మహిమ దాట్ల రూ.13,600 కోట్లు.

## ఇందిరమ్మ పేరు పెడితే ఇళ్ళివ్వం

### మోదీ ప్రభుత్వం మంజూరు చేసే ఇండ్లకు ఇందిరమ్మ పేరా?

- కొత్త రేషన్ కార్డులపై సీఎంతోపాటు ప్రధాని ఫోటో ఉండాల్సిందే
- కేంద్రం ఉచితంగా బియ్యం ఇస్తుంది.. దీవోస్ పెట్టుబడుల ఎంవోయూలన్నీ హంబక్కే
- గత పదేళ్లలో దావోస్ పెట్టబడులపై శ్వేత పత్రం విడుదల చేయాలి
- అవినీతిలో బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్.. రేవంత్ రెడ్డి గురువు కేసీఆరే
- ఎన్నికలెప్పుడొచ్చినా కరీంనగర్ కార్పొరేషన్ బీజేపీదే
- బీజేపీని గెలిపిస్తే కేంద్రం నిధులతో కరీంనగర్ ప్రజలందరికీ ఉచితంగా నీరందిస్తా

కేంద్ర మంత్రి బండి సంజయ్



**కరీంనగర్, మహా :** ప్రధానమంత్రి ఆవాస్ యోజన పేరుతో కేంద్రం మంజూరు చేసే ఇండ్లకు ఇందిరమ్మ పేరు పెడితే ఒక్క ఇల్లు కూడా మంజూరు చేసే ప్రసక్తి లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుంటే రేషన్ కార్డులపై ప్రధాని ఫోటో ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. ఇకపై కొత్త రేషన్ కార్డులపై సీఎంతో పాటు ప్రధానమంత్రి ఫొటో కూడా పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉచిత బియ్యం ఎందుకు సరఫరా చేయాలని ప్రశ్నించారు. అవసరమైతే కేంద్రమే నేరుగా పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేసే విషయాన్ని ఆలోచిస్తామని స్పష్టం చేశారు. దావోస్ వేదికగా లక్షల కోట్ల రూపాయల పెట్టబడులపై ఎంఓయూలు జరిగాయంటూ జరుగుతున్న ప్రచారమంతా హంబక్ అని సంజయ్ కొట్టి పారేశారు. గత పదేళ్లలో 5 లక్షల కోట్ల రూపాయలకుపైగా పెట్టబడులు రాబోతున్నాయని అవగాహన ఒప్పందాలు చేసుకున్నారని, ఆచరణలో మాత్రం పదో వంతు కూడా రాలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా 2014 నుండి నేటి వరకు దావోస్ పెట్టుబడులకు సంబంధించి ఎంత మొత్తంలో ఎంఓయూలు జరిగాయి? ఎంత మందికి ఉద్యోగాలిస్తామన్నారు? ఆచరణలో ఎన్ని పెట్టబడులు వచ్చాయి? ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చారో శ్వేత పత్రం విడుదల చేయాలని సవాల్ విసిరారు.

కరీంనగర్ లోని ఎస్ బీఎస్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ సునీల్ రావుతో పాటు ఇద్దరు కార్పొరేటర్లు, వందలాది మంది బీఆర్ఎస్ నాయకులు సంజయ్ సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. వారందరినీ బీజేపీలో సాదరంగా ఆహ్వానిస్తూ బండి సంజయ్ కాషాయ కండువా కప్పారు. అనంతరం వారిని ఉద్దేశించి ప్రసంగిస్తూ నరేంద్ర మోదీ నాయకత్వంపై నమ్మకంతో, పార్టీ సిద్ధాంతాలు నమ్మి బీజేపీలో చేరుతున్న కరీంనగర్ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్లు స్వప్న, శ్రీదేవిలకు సాదర స్వాగతం పలికారు. బీజేపీలో చేరుతామని చాలా మంది వస్తున్నారని, భూకబ్జాలకు పాల్పడే వారిని బీజేపీలో చేర్చుకోబోమన్నారు. కరీంనగర్ అభివృద్ధికి నిధులు తెచ్చిందెవరో నిన్నటి కేంద్ర మంత్రి రాకతో ప్రజలకు తేటతెల్లమైందన్నారు. బీఆర్ఎస్ పాలనలో అవినీతి, అక్రమాలకు అంతులేకుండా పోయాయని, బీఆర్ఎస్ అడుగుజాడల్లోనే కాంగ్రెస్ నడుస్తోందని సంజయ్ వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి గురువు కేసీఆరేనని, అందుకే ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, డ్రగ్స్, ఫాంహౌజ్ సహా స్కాంలన్నీ మరుగునపడ్డాయన్నారు. ఫార్ములా ఈ రేస్ కేసులో కేటీఆర్ రేపే అరెస్ట్ అంటూ నెల రోజులు ఊదరగొట్టి ఏం సాధించారని ప్రశ్నించారు. కేటీఆర్ అరెస్ట్‌కు అన్ని ఆధారాలున్నాయని సీఎం చెప్పిన తరువాత కూడా ఎందుకు అరెస్ట్ చేయడం లేదన్నారు. కేసీఆర్ ఢిల్లీలో కప్పం కట్టగానే ఈఫార్ములా కేసును అటకెక్కించారని, గ్రీన్ కో వంటి సంస్థలను భయపెట్టడంవల్ల ఏం లాభం?. గ్రీన్ కో సంస్థ నుండి కాంగ్రెస్ పార్టీకి చందాల రూపంలో పైసలు ముట్టాయన్నారు. పార్టీ చందాల పేరుతో పైసలు తీసుకుని మళ్లీ ఆ సంస్థనే ఇబ్బంది పెట్టడం ఎంత వరకు కరెక్ట్ అని అడిగారు.

దావోస్ పెట్టుబడులతో సిగ్గు లేకుండా అప్పుడు ప్రచారం చేసుకుంటున్నారంటూ 2014 నుండి ఇప్పటి వరకు దావోస్ పర్యటనల్లో ఎన్ని పెట్టుబడులకు ఎంఓయూలు జరిగాయి? ఎంత మందికి ఉద్యోగాలిస్తామన్నారు?. ఆచరణలో ఎన్ని పెట్టబడులు వచ్చాయి? ఎంత మందికి ఉద్యోగాలు వచ్చాయో శ్వేత పత్రం విడుదల చేసే దమ్ము కాంగ్రెస్ కు ఉందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ స్కాంలపై దారి మళ్లించేందుకు దావోస్ పెట్టుబడుల జాతర పేరుతో ప్రచారం చేసుకుంటున్నారన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ అందక లక్షల మంది విద్యార్థులు అల్లాడుతున్నరని, ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోవడంతో పేదలకు వైద్యం అందక చస్తున్నా పట్టించుకోరన్నారు. పెండింగ్ బిల్లులు రాక మాజీ సర్పంచులు ఆత్మహత్య చేసుకుంటున్నా స్పందించరన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయంటే కేంద్రం నిధులే కారణమన్నారు. కేంద్రం నిధులిస్తే... దొబ్బిపోతున్న పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే కేంద్రం నుండే నిధులు తెచ్చి కార్పొరేషన్ ప్రజలందరికీ 24 గంటలపాటు ఉచిత నీరందిస్తామని హామీ ఇచ్చారు.

## బండి సంజయ్‌పై మహేష్ గౌడ్ ఫైర్

- తెలంగాణ సమాజానికి క్షమాపణలు చెప్పాలి
- రాబోయే ఎన్నికల నాటికి బీఆర్ఎస్ నాలుగు ముక్కలు



**హైదరాబాద్, మహా:** రాబోయే ఎన్నికల నాటికి బీఆర్ఎస్ నాలుగు ముక్కలు కావడం ఖాయమని.. బీఆర్ఎస్‌లో తండ్రి, కొడుకు తప్ప ఎవరూ మిగలరు అని పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సమాజానికి బండి సంజయ్ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఉక్కు మహిళ మాజీ ప్రధాని ఇందిరా గాంధీపై బండి సంజయ్ వ్యాఖ్యలు దిగజారుడు తనానికి నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ చేతల ప్రభుత్వం అనడానికి దావోస్ పెట్టుబడులే నిదర్శనమని చెప్పారు. తెలంగాణ స్వరాష్ట్ర ఏర్పాటు తర్వాత రికార్డు స్థాయిలో లక్షా 78 వేల 950 కోట్ల పెట్టుబడులు రావడం ఇదే తొలిసారి అని స్పష్టం చేశారు. పదేళ్లలో కేసీఆర్ఒక్క ఉద్యోగం ఇచ్చిన పాపాన పోలేదని విమర్శించారు. ప్రజలు పదేళ్లు అధికారం ఇస్తే రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజల పదేళ్ల నిరీక్షణ ఇందిరమ్మ ఇళ్లతో తీరబోతోందని కీలక ప్రకటన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని అన్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా సీఎం రేవంత్, మంత్రుల హయంలో ఇచ్చిన హామీల మేరకు తెలంగాణలో పాలన సాగుతోందని తెలిపారు.

## ప్రగతి దిశగా భారత్ పయనం

### దేశంలో సుపరిపాలనకు వన్ నేషన్ వన్ ఎలక్షన్

### రిపబ్లిక్ డే ప్రసంగంలో రాష్ట్రపతి ముర్ము



**ఢిల్లీ, మహా:** దేశం 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రజలందరికీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుభాకాంక్షలు తెలిపారు. ప్రగతి లక్ష్యాల దిశగా భారతదేశం నిజమైన ప్రయాణం సాగిస్తోందని, అంతర్జాతీయంగా నాయకత్వం వహించేలా భారత్ ఎదుగుతోందని అన్నారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు అవుతున్న సందర్భంగా రిపబ్లిక్ డే వేడుక జరుగుతుండటం దేశప్రజలంతా గర్వహించదగిన విషయమని అన్నారు. భరతమాత విముక్తి కోసం త్యాగాలు చేసిన వారిని స్మరించుకోవాలని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా చట్టాలు మార్చుకున్నామని, కొత్తచట్టాలు రూపొందించి అమల్లోకి తెచ్చామని అన్నారు. వలసవాదుల ఆలోచనా విధానం మార్చేందుకు దేశం ప్రయత్నాలు చేస్తోందన్నారు. శనివారం రాత్రి దేశ ప్రజలను ఉద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగంలో జమిలి ఎన్నికల అంశాన్ని కూడా ప్రస్తావించారు. '1947లో మనకు స్వాతంత్ర్యం వచ్చింది. అయితే వలసవాదుల ఆలోచనా విధానం చాలాకాలంగా మనను చాలాకాలంగా వెన్నాడుతోంది. ఆలస్యంగానైనా వలసవాదుల ఆలోచన విధానాన్ని మార్చేందుకు దేశం ప్రయత్నాలు చేస్తోంది. ఇండియన్ పీనల్ కోడ్, కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌ల స్థానే భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అభినియం తీసుకువచ్చాం. మార్పుల చేసిన చట్టాలతో మహిళలు, చిన్నారులపై నేరాలకు వ్యతిరేకంగా కట్టుదిట్టమైన చర్యలు అత్యధిక ప్రాధాన్యతనిచ్చాం'' అని రాష్ట్రపతి తెలిపారు. భారత రాజ్యాంగం గత 75 ఏళ్లుగా మన ప్రగతికి మార్గాలు వేసిందని, రాజ్యాంగాన్ని మనకు ప్రసాదించిన డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఇతర సభ్యుల కృషికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామని రాష్ట్రపతి అన్నారు. మన యువ భారత సర్వతోముఖాభివృద్ధికి రాజ్యాంగం ఎంతగానో దోహదపడిందని చెప్పారు. కనీస సౌకర్యాల కల్పించడం ద్వారా దేశ సంక్షేమాన్ని ప్రభుత్వం పునర్నిర్వచించిందని అన్నారు.

### సుపరిపాలనకు జమిలి మార్గం

**దేశంలో సుపరిపాలన అందించేందుకు "వన్ నేషన్ వన్ ఎలక్షన్" విధానం తోడ్పడుతుందని రాష్ట్రపతి అన్నారు. స్థిరత్వాన్ని ప్రోత్సహించడం, వనరుల మళ్లింపును, ఆర్థిక భారాన్ని తగ్గించడం వంటి అనేక రకాల ప్రయోజనాలు జమిలి ఎన్నికల వల్ల కలుగుతాయని అన్నారు. గత దశాబ్దాంగా విద్యారంగంలో సంస్కరణల ద్వారా నాణ్యతాయుతమైన విద్యను అందించడం, ఫిజికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డిజిటల్ ఇన్‌క్లూషన్ సుసాధ్యమైందన్నారు.**

## గవర్నర్ ఫోన్ ట్యాప్..! బీఆర్ఎస్‌కు కొత్త తలనొప్పి

### కొత్త మలుపు తీసుకున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం.. తెరపైకి సీబీఐకి అప్పగించాలన్న డిమాండ్



**హైదరాబాద్, మహా :** తెలంగాణ లో కలకలం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కొత్త మలుపు తీసుకుంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పలువురి నేతల ఫోన్లు ట్యాపింగ్ కు గురయ్యాయనే ఆరోపణలున్నాయి. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాయ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించింది. కేసు నమోదైన వెంటనే పలువురు నేతలు ముందుకొచ్చి తమ ఫోన్లను కూడా బీఆర్ఎస్ ట్యాప్ చేసిందని ఫిర్యాదులు చేశారు. పలువురు బీజేపీ నేతలు కూడా ఇందులో ఉన్నారు. తాజాగా త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి ఫోన్ కూడా ట్యాపింగ్ కు గురైనట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు నేతృత్వంలో పలువురు నేతల ఫోన్లను ట్యాప్ చేశారనే ఆరోపణలున్నాయి. దీనిపై విచారణ ప్రారంభించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం అప్పటి ఎస్ఐబీ అధికారులు ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్ తదితరులను అరెస్టు చేసింది. ప్రభాకర్ రావుతో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న శ్రవణ్ కుమార్ అమెరికాకు వెళ్లి తలదాచుకున్నారు. నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఇందులో ప్రస్తుత త్రిపుర గవర్నర్ ఫోన్ కూడా ట్యాపింగ్ గురైనట్లు గుర్తించారు. 2023 నవంబర్ 15 నుంచి 30 మధ్య 15 రోజులపాటు ఇంద్రసేనా రెడ్డి ఫోన్ ను ట్యాప్ చేసినట్లు సమాచారం. దీనికి సంబంధించి ఇంద్రసేనా రెడ్డి పీఏ సిట్ ముందు హాజరై వాంగ్మూలం ఇచ్చారు. 2023 అక్టోబర్ 19న విద్యాసాగర్ రావు త్రిపుర గవర్నర్ గా నియమితులయ్యారు. గవర్నర్ గా నియమితులైన నెలరోజుల్లోనే ఆయన ఫోన్ ను ఎందుకు ట్యాప్ చేశారనేది అర్థం కావట్లేదు. తన ఫోన్ ను కూడా ట్యాప్ చేశారని గతంలోనే ఇంద్రసేనా రెడ్డి ఫిర్యాదు చేశారు. ఇది నిజమేనని ఇప్పుడు తేలడంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు దాదాపు 3వందల మంది ప్రముఖుల ఫోన్లను ట్యాప్ చేశారనే ఆరోపణలున్నాయి. కాంగ్రెస్, బీజేపీతో పాటు బీఆర్ఎస్ నేతల ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్లు సమాచారం. అంతేకాక పలువురు జర్నలిస్టులు, మీడియా అధిపతులు, కేంద్ర మంత్రుల ఫోన్లపై కూడా నిఘాపెట్టారనే ఆరోపణలున్నాయి. వీటని నిగ్గు తేల్చేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిట్ ను ఏర్పాటు చేసింది. ఎస్ఐబీలో హార్డ్ డిస్క్ లను మాయం చేయడంతో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం నిజమేనని అనుమానాలు తలెత్తాయి. అయితే కేంద్ర పెద్దల ఫోన్లను కూడా ట్యాప్ చేశారనే ఆరోపణలపై బీజేపీ ఆగ్రహంతో ఉంది. సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తోంది. ఒకవేళ ఈ కేసును సీబీఐకి అప్పగిస్తే బీఆర్ఎస్ నేతలకు ఇబ్బందులు తప్పకపోవచ్చు.

EDITORIAL సంపాదకీయం

# దావోస్ పెట్టుబడులతో గ్రేటర్‌లో పెరిగిన సీఎం ఇమేజ్

దావోస్ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాధించిన పెట్టుబడుల విజయం రాష్ట్రప్రభుత్వానికి మైలేజీ తీసుకొచ్చింది. పెట్టుబడుల ప్రవాహంతో హైదరాబాద్ లో రేవంత్ ఇమేజ్ పెరగనుంది. గ్రేటర్ హైదరాబాద్ కు అగ్రశ్రేణి సంస్థలు వచ్చి వేలాది కోట్ల పెట్టుబడులు పెడితే ఉపాధి అవకాశాలు పెరగడంతో రాష్ట్ర ఆర్థికముఖచిత్రం మారుతుంది. హైదరాబాద్ చుట్టూ రియల్ ఎస్టేట్ కూడా గణనీయంగా పెరుగుతుంది. హైడ్రా తర్వాత గ్రేటర్ హైదరాబాద్ లో సీఎం ఇమేజ్ పెరగ్గా, తాజా పెట్టుబడులు మంచి బూస్ట్ ను అందించాయి. గ్రామసభలు ప్రణాళిక లోపంతో గందరగోళమైనా దశాబ్దకాలం తర్వాత ఇస్తున్న రేషన్ కార్డులు సజావుగా ప్రజలకు అందితే ప్రజలు గుర్తు పెట్టుకుంటారు. సమన్వయలోపాలు అధిగమిస్తూ ప్రభుత్వం ముందడుగు వేస్తే అనుకున్న లక్ష్యాలు సాధించగలుగుతారు.

- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సీఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలిసిస్



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

డేటాసెంటర్ల ఏర్పాటుకు హైదరాబాద్ వాతావరణ, మానవ వనరుల పరంగా ఎంతో అనుకూలం. గతంలో నాస్కామ్ ఇదే చెప్పింది. గత ఏడాది ముఖ్యమంత్రి దావోస్ పర్యటన సందర్భంగా భారీ పెట్టుబడులు సాధించడంతో పాటు వాటిని చాలా వరకు పట్టాలెక్కించారు. ఇతర రాష్ట్రాలకు వాతావరణ పరంగా, భౌగోళికంగా అనేక ఇబ్బందులున్నాయి. మాకు హైదరబాద్ ఉంది.. మేం చైనా ప్లస్ వన్ సిటీగా మారుతాం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతను చాటారు. దీనిని తమ భాషా పరిజ్ఞానంతో విపక్ష బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , ఆయన టీమ్ అవహేళన చేసింది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాటి నుండీ ఆయన ఆవేశపరుడే కానీ పరిపాలన దక్షుడు కాదని నిరూపించాలని విశ్వప్రయత్నాలు చేస్తోంది. కానీ దావోస్ వేదికగా వీటన్నింటినీ పటాపంచలు చేస్తూ దిమ్మతిరిగే ఫలితాలు సాధించారు. రేవంత్ పరిపాలనా దక్షుడే కాదు.. అనితర సాధ్యుడు అని చాటాడు. గత తొమ్మిదేళ్ళలో తన వేషబాషలతో రూ.25వేల కోట్ల పెట్టుబడులు కేటీఆర్ సాధిస్తే, ముఖ్యమంత్రిగా రేవంత్ రెండు విడతల్లో పద్నాలుగు మాసాల్లోనే 2లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు సాధించాడు. గతంలో అమెజాన్ అమెరికా దాటి ఎక్కడా రూ.20వేల కోట్ల పెట్టుబడులు పెట్టలేదని ఇది చారిత్రాత్మకం అంటూ రోజుల తరబడి ఊదరగొట్టిన గత ప్రభుత్వానికి, గత పరిశ్రమల మంత్రికి ఇపుడు ఏకంగా రూ. 60వేల కోట్ల పెట్టుబడికి ఒప్పందం చేసుకోవడం షాకే. మీ 25వేల కోట్లెక్కడ.. మా 2లక్షల కోట్లెక్కడ? కడుపుబ్బరం తగ్గించుకోండి. ఈనో వాడండి అంటూ కాంగ్రెస్ నేతలు వినూత్న ప్రచారానికి దిగారు. గత పద్నాలుగు మాసాల్లో కాంగ్రెస్ పార్టీ అనేక కార్యక్రమాలు నిర్వహించినా, మొట్టమొదటి సారి అడ్వాంటేజ్ తీసుకునే ప్రయత్నం చేసింది. ఈనో ప్రచారం హిట్టయింది. ఇదంతా బీఆర్ఎస్ ఒకప్పుడు వాడిన టెక్నిక్కే.



ఎన్నిపథకాలు పెట్టినా ప్రజలను సన్నద్ధం చేయకుండా ఇస్తే ఈ ప్రభుత్వానికి జరిగే మేలేమీ లేదు. ఏ పథకమైనా హడావుడిగా కంటే.. మెల్లిగా ప్రజలను సన్నద్ధం చేసి అందించాలి. కానీ ప్రభుత్వంలో సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. ముఖ్యమంత్రి దావోస్ లో పెట్టుబడుల వేటలో ఉంటే అదే సమయంలో నిర్వహించిన గ్రామసభలు ఒక్కసారిగా గందరగోళంగా జరిగాయి. సరిగ్గా ప్రిపేర్ చేయకుండానే గ్రామసభల్లో జాబితాలు చదివారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలు పథకాలు అందుతాయా లేవా అన్న ఆందోళనకు గురయ్యారు. నాలుగు పథకాలు ఒకేసారి ఎందుకు ప్రారంభించాలనుకున్నారో తెలియదు. ఒక్కో పథకం ప్రజలను సన్నద్ధం చేస్తూ లబ్దిదారులు అందరికీ చేరేలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. అర్హులకు పథకాలు దరిచేరేలా ప్రభుత్వం, అధికారయంత్రాంగం పూర్తి బాధ్యతగా వ్యవహరిస్తేనే ప్రజలకు మేలు కలుగుతుంది. రుణమాఫీ చరిత్రలో ఎవరూ ఖర్చుపెట్టనంత డబ్బు ఒకేసారి ఖర్చుచేసినా ప్రభుత్వానికి అనుకున్నంత పేరు రాలేదు. అయితే ప్రతిపక్షాలు ఎంత పనిచేసినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రమ, పట్టుదల ముందు ప్రతిపక్షం పాచికలు అంతగా పారడం లేదు.

ఇంతకాలం తయారుచేసిన వ్యతిరేకతను పెట్టుబడుల ధమాకా తొలగించగా, సంక్షేమ పథకాలను ఆలస్యమైనా అందరికీ అందించాలన్న వ్యూహంతో ప్రభుత్వం ఉంది. సంక్షేమ పథకాలు అందించి స్థానిక సమరానికి కాలుదువ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. పథకాలను సరైన గాడిలో పెట్టకుండా స్థానిక ఎన్నికలకు వెళ్తే అది సాహసమే.

బిజెపిలో అధ్యక్షపదవి మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ కు ఖాయమైందన్న ప్రచారం బాగా సాగుతోంది. అయితే అధ్యక్షపదవి కోసం పార్టీలో అతివాద గ్రూపులు, మితవాద గ్రూపులు రకరకాలుగా చీలిపోయి భిన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తాజాగా ఈటల రాజేందర్ రేసులో ఉన్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత పార్టీలో అలజడి రేగింది. ధర్మపురి అరవింద్, రఘునందన్ రావు లాంటి నేతలు పదవి కోసం పోటీపడుతున్నారు. బిజెపి హైకమాండ్ అధ్యక్షపదవిని ఖరారుచేసే దానిని బట్టి భవిష్యత్ తెలంగాణ రాజకీయాలు ఆధారపడి ఉన్నాయి.



## ప్రపంచ తయారీరంగంలో అమెరికా సంక్షోభం

అమెరికా వింత నిర్ణయాలతో ప్రపంచాన్ని ప్రభావితం చేస్తోంది. ప్రపంచదేశాలకు అమెరికా అన్ని రకాల ఆర్థిక సాయం నిలిపివేయడంతో ప్రపంచంలో తయారీ రంగం సంక్షోభానికి గురి అయ్యే ప్రమాదముంది. దీంతో పాటు విద్య, వైద్య, మానవతా సేవల కార్యక్రమాలు వెంటనే నిలిచిపోనున్నాయి. ప్రపంచంలోని అన్ని దేశాలకు ఆర్థిక సాయం అమెరికా నిలిపివేసింది. అన్ని దేశాలకు తక్షణమే ఆర్థిక సాయం నిలిపివేస్తున్నట్లు అమెరికా సెక్రటరీ ఆఫ్ స్టేట్ మార్కో రూబియో ప్రకటించారు. అయితే ఈ జాబితాలో ఇజ్రాయెల్, ఈజిప్ట్ దేశాలను మినహాయించారు. ఈ రెండు దేశాలకు మిలిటరీ సాయం, ఆర్థిక సాయం అమెరికా అందిస్తూనే ఉంటుందని ఆయన తెలిపారు. ప్రపంచంలోని అన్ని అమెరికా రాయబార కార్యాలయాలకు మార్క్ రూబియో ప్రభుత్వ నిర్ణయాలను తెలియజేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్త విదేశీ పాలసీల ప్రకారమే ఈ ఆదేశాలు జారీ అయ్యాయని 'ది న్యూ యార్క్ టైమ్స్' ప్రచురించింది. ఈ కథనం ప్రకారం.. అమెరికాను ఆర్థికంగా బలపరిచేందుకే ఈ నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. ఈ ఆదేశాల ప్రకారం.. అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాల సాయంతో రష్యా యుద్ధం చేస్తున్న ఉక్రెయిన్ కు కూడా ఆర్థిక సాయం ఆపివేయబడింది. అన్ని ప్రపంచ దేశాలకు తక్షణమే ఆర్థిక సాయం నిలిపివేయబడింది, ఏదైనా అత్యవసర కార్యక్రమాల కోసం లేదా మినహాయింపుల కోసం సెక్రటరీ ఆఫ్ స్టేట్ మార్కో రూబియో ఆమోదం ఉంటే ఆ దేశాలకు మాత్రమే ఆర్థిక సాయం కొనసాగించడం జరుగుతుందని ప్రభుత్వ ప్రకటనలో పేర్కొన్నారు. అమెరికా తీసుకున్న ఈ కఠిన నిర్ణయం కారణంగా ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పలు వైద్య కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు అర్ధాంతరంగా నిలిచిపోనున్నాయి. ఉక్రెయిన్ యుద్ధం కోసం అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ అనుమతించిన మిలిటరీ ఆర్థిక సాయం కూడా నిలిచిపోనుంది. కానీ మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో అమెరికాతో సన్నిహిత సంబంధాలు కలిగిన ఇజ్రాయెల్, ఈజిప్ట్ దేశాలకు మాత్రం అమెరికా నుంచి ఆర్థిక సాయం కొనసాగుతుంది. ప్రతీ సంవత్సరం ఇజ్రాయెల్ కు మిలిటరీ ఆర్థిక సాయం కోసం అమెరికా 3.3 బిలియన్ డాలర్లు అందిస్తోంది. ఈ సాయంతోనే ఇజ్రాయెల్ ఇంతకాలం గాజాలో హమాస్ తో యుద్ధం చేస్తూ ఉంది. మరోవైపు గల్ఫ్ దేశాల్లో ఇజ్రాయెల్ దేశంతో 1979లో శాంతి సంధి చేసుకున్నందుకు ఈజిప్ట్ కు అమెరికా భారీగానే ఆర్థిక సాయం అందిస్తోంది. ప్రపంచదేశాలకు అమెరికా అన్ని రకాల ఆర్థిక సాయం నిలిపివేయడంతో ప్రపంచంలో తయారీ రంగం సంక్షోభానికి గురి అయ్యే ప్రమాదముంది. దీంతో పాటు విద్య, వైద్య, మానవతా సేవల కార్యక్రమాలు వెంటనే నిలిచిపోనున్నాయి. ఉదాహరణకు యుద్ధం కారణంగా ఉక్రెయిన్ లో గర్భిణీ మహిళలకు ఉచిత వైద్యం, టీకా కార్యక్రమాలు ఆగిపోనున్నాయి. ఈ కార్యక్రమాలకు ఆర్థిక సాయం కొనసాగించాలని ట్రంప్ ఆదేశాల్లో వీటికి మినహాయింపు ఇవ్వాలని ఇప్పటికే ఉక్రెయిన్ వైద్య రంగం అమెరికాకు అభ్యర్థన చేసింది. కానీ 90 రోజుల వరకు ఎలాంటి ఆర్థిక సాయం అందించేది లేదని అమెరికా స్పష్టం చేసింది. మరోవైపు గాజాలో కాల్పుల విరమణ చేసినందుకే ఇజ్రాయెల్ కు ఆర్థిక సాయం కొనసాగిస్తున్నామని తెలిపింది. అయితే గాజాలో, ఆఫ్రికాలోని సుడాన్ దేశంలో కరువు, ఆకలి చావులు కేసులు వందల సంఖ్యలో పెరిగిపోతున్నాయి. కానీ అమెరికా మాత్రం ప్రపంచ ఆరోగ్య సంస్థకు నిధుల అందించేది లేదని ప్రకటించింది. దీంతో గాజాలో ఆరోగ్య సంకోభం నెలకొంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికా ఇంకా ఎలాంటి దూకుడు నిర్ణయాలు తీసుకుంటుందోనని ప్రపంచమంతా చూస్తోంది.




## 76వ గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

### ఈసారి ప్రత్యేకతలివే

**విరాసత్ ఔర్ వికాస్ ఇతివృత్తంతో ఈసారి గణతంత్ర వేడుకలు**

**కర్తవ్యపథ్‌లో గణతంత్ర వేడుకలు**

**మహా:** 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత్ తన సైనిక సామర్థ్యాన్ని, ఘనమైన సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటనుంది. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణిమ్ భారత్, విరాసత్ ఔర్ వికాస్ అనే ఇతివృత్తంతో ఈసారి గణతంత్ర వేడుకలు నిర్వహించనున్నారు. డీఆర్డీఓ అభివృద్ధి చేసిన ఉపరితలం నుంచి ఉపరితలంపై లక్ష్యాలను ఛేదించే ప్రళయ్ బాలిస్టిక్ క్షిపణిని తొలిసారి రిపబ్లిక్ పరేడ్‌లో ప్రదర్శించనున్నారు. ఈసారి ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఢిల్లీ కర్తవ్యపథ్‌లో గణతంత్ర వేడుకల కోసం పెద్దఎత్తున ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం ఉదయం తొమ్మిదిన్నరకు జాతీయ యుద్ధ స్మారకం రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, రక్షణమంత్రి, త్రివిధ దళాధిపతులు, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ తదితరులు నివాళుర్పించనున్నారు. అనంతరం కర్తవ్యపథ్‌లో గణతంత్ర వేడుకలు మొదలవుతాయి. రాష్ట్రపతి ద్రౌపదీముర్ము, ఇండోనేసియా అధ్యక్షుడు సంప్రదాయ గుర్రపుబగ్గీలో కర్తవ్యపథ్ చేరుకుంటారు.

**కవాతులో ఇండోనేషియా సైనికులు**

తొలుత జాతీయజెండాను ఆవిష్కరిస్తారు. పదిన్నరకు గణతంత్ర దినోత్సవ కవాతు మొదలవుతుంది. అందులో ఇండోనేసియా సైనికులు కూడా పాల్గొంటారు. 190మంది మిలిటరీ బ్యాండ్, 152మంది మార్చ్‌ఫాస్ట్ చేయనున్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75ఏళ్లు పూర్తయిన వేళ స్వర్ణిమ్ భారత్, విరాసత్ ఔర్ వికాస్ అనే ఇతివృత్తంతో ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు. 16 రాష్ట్రాలతోపాటు కేంద్రపాలిత ప్రాంతాలు, 10 కేంద్రప్రభుత్వ శాఖలకు చెందిన శకటాలు ఈ పరేడ్‌లో పాల్గొంటాయి.

### పరేడ్‌లో డీఆర్డీఓ ప్రళయ్ క్షిపణి

ఈ సందర్భంగా భారత్ తన సైనికశక్తిని ప్రపంచానికి చాటనుంది. బ్రహ్మోస్ క్షిపణి, పినాక మల్టీ బ్యారెల్ రాకెట్, ఆకాశ్ క్షిపణులు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. డీఆర్డీఓ అభివృద్ధి చేసిన ఉపరితలం నుంచి ఉపరితలంపై లక్ష్యాలను ఛేదించే ప్రళయ్ బాలిస్టిక్ క్షిపణి తొలిసారి పరేడ్‌లో దర్శనమివ్వనుంది. నాగ్ మిసైల్ వ్యవస్థ, మల్టీబ్యారల్ రాకెట్ లాంఛ్ సిస్టం అగ్నిబాణ్, తేలికపాటి వాహనం భజ్‌రంగ్‌లను కూడా పరేడ్‌లో ప్రదర్శించనున్నారు. బలమైన, సురక్షిత భారత్ ఇతివృత్తంతో త్రివిధదళాలు సంయుక్తంగా ఓ శకటాన్ని ప్రదర్శించనున్నాయి. రక్షా కవచ్ ఇతివృత్తంతో డీఆర్డీఓ శకటాన్ని ప్రదర్శించనుంది. సీ-130జె సూపర్ హెర్క్యులస్, సీ-295, సీ-17 గ్లోబ్‌మాస్టర్, మిగ్-29, సుఖోయ్-30 జెట్ ఫైటర్లు విన్యాసాలతో అబ్బురపర్చనున్నాయి.

## రోజూ ఈ గింజలు తింటే కొవ్వు ఐస్‌లా కరిగిపోతుంది తెలుసా..?

**ఈ మధ్య కాలంలో చాలామంది హై కొలెస్ట్రాల్ సమస్యను ఎదుర్కొంటున్నారు. రక్తంలో కొవ్వు సమస్యతో బాధపడుతున్నారు. మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లే ఇందుకు కారణమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అధిక కొలెస్ట్రాల్ కారణంగా గుండె జబ్బుల బారినపడే ప్రమాదం ఉంది. కొలెస్టరాల్ తగ్గడానికి కొన్ని రకాల గింజలు మేలు చేస్తాయి. వాటిలో ఫైబర్‌తోపాటు మన శరీరానికి అవసరమయ్యే ఎన్నో పోషకాలు ఉంటాయి. ఆ గింజలను ఆహారంగా తీసుకోవడంవల్ల కొవ్వు సమస్య నుంచి ఈజీగా బయటపడొచ్చు. మరి ఆ గింజలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం..**

అవిసె గింజలు గుండె ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. వీటినే లీన్ సీడ్స్ అని కూడా అంటారు. ఈ గింజల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉంటాయి. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇవి తోడ్పడుతాయి. కొలెస్ట్రాల్ సమస్యను తగ్గించడంలో చియా విత్తనాలు కూడా దోహదపడతాయి. వీటిలో కూడా ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇవి దోహదపడతాయి. అదేవిధంగా జనపనార విత్తనాలను తీసుకోవడంవల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. వీటిలో ప్రోటీన్‌తోపాటు గామా లినోలెనిక్ యాసిడ్ ఉంటుంది. కొలెస్టరాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇవి చక్కగా పనిచేస్తాయి. గుమ్మడి గింజలు కూడా కొవ్వును తగ్గించడంలో బాగా పనిచేస్తాయి. ఈ గింజలల్లో ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్స్, మోనో శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. నువ్వులకు కూడా కొవ్వును తగ్గించే గుణం ఉంది. వీటిలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. కడుపులో మంటను తగ్గించడంలో, కొవ్వును కరిగించడంలో ఇవి సాయపడతాయి. రక్తంలో కొవ్వు సమస్యతో బాధపడేవారు పొద్దుతిరుగుడు గింజలను




తీసుకోవడంవల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. వీటిలో విటమిన్ 'ఇ' తోపాటు మోనో శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో ఇవి సాయపడుతాయి. నల్ల నువ్వులను తీసుకోవడం వల్ల కూడా చెడు కొవ్వు తగ్గుతుంది. వీటితో రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు క్యాన్సర్ ముప్పు కూడా తగ్గుతుంది.

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999

## నాలాంటోళ్లు ఇంకా వెయ్యి మంది పోయినా..

# జగన్‌కు నష్టమేమీ లేదు

## విజయసాయిరెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు



**మహా:** రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు విజయసాయిరెడ్డి ప్రకటించడం ఏపీ రాజకీయాల్లో సంచలనంగా మారింది. వైసీపీలో నంబర్ 2గా ఉన్న విజయసాయి రెడ్డి వెళ్లడం వల్ల జగన్‌కు, పార్టీ తీవ్ర నష్టం జరిగినట్లేనని అంతా అనుకుంటున్నారు. ఇలాంటి తరుణంలో విజయసాయి రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. జగన్ అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడు అని ఆయన తెలిపారు. తనలాంటి వాళ్లు వెయ్యి మంది వెళ్లినా జగన్‌కు ఆదరణ తగ్గేదే లేదని ఆయన స్పష్టం చేశారు. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన అనంతరం విజయసాయి రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు. తాను రాజీనామా చేయడానికి ముందు జగన్‌తో అన్ని విషయాలను చర్చించానని తెలిపారు. పదవికి రాజీనామా చేయడం సరికాదని కూడా జగన్ సూచించారని చెప్పారు. కానీ పదవికి న్యాయం చేయలేకపోతున్నా కాబట్టే రాజీనామా చేస్తున్నానని తెలిపారు. అబద్ధాలు చెప్పకుండా ఈ రోజుల్లో రాజకీయాలు చేయడం కష్టమని ఆయన అభిప్రాయపడ్డారు. దైవ భక్తుడిగా నేను అబద్ధాలు చెప్పలేను.. అందుకే తప్పుకుంటున్నానని వివరించారు. విజయసాయి రెడ్డి ప్రాతినిధ్యాన్ని ఎవరూ తగ్గించలేరని అన్నారు.

### నాకు నమ్మకద్రోహం చేయడం తెలియదు

పదవికి రాజీనామా చేసినందుకు తనకు ఎలాంటి బాధ లేదని విజయసాయి రెడ్డి అన్నారు. సీటు కూటమికి వస్తుందని తెలిసే తెలిసే రాజీనామా చేశానని తెలిపారు. నాకంటే గొప్పగా ఆలోచించే వ్యక్తులకు ఈ పదవి ఇస్తే బాగుంటుందని సూచించారు. తనపై 22 కేసులు ఉన్నాయని.. ఎప్పుడూ భయపడే వ్యక్తిని కాదని ఆయన స్పష్టంచేశారు. 2014లో తనను అప్రూవర్‌గా మారాలని ఎంతో బలవంతపెట్టారని.. అయినప్పటికీ నిరాకరించానని తెలిపారు. అప్పుడు ఉన్న పరిస్థితులే ఇప్పుడు కూడా ఉన్నాయని చెప్పారు. దైవాన్ని నమ్మిన వ్యక్తిగా నమ్మకద్రోహం, మోసం చేయడం తనకు తెలియదని స్పష్టం చేశారు.

### నేను పోయినంత మాత్రన వైసీపీకి నష్టమేమీ లేదు

వైసీపీ కోసం 2014 నుంచి సర్వశక్తులూ వినియోగించానని విజయసాయిరెడ్డి తెలిపారు. కార్యకర్తల కోసమే నిరంతరం పనిచేశానని పేర్కొన్నారు. తాను వీడినంత మాత్రాన పార్టీకి నష్టం లేదని అన్నారు. తనలాంటి వాళ్లు పార్టీలో ఇంకా ఉన్నారని.. భవిష్యత్తులో వస్తారని తెలిపారు. తాను ఎప్పుడూ అబద్ధాలు చెప్పనని ఆయన అన్నారు. అబద్ధాలు చెబితే దేవుడు శిక్షిస్తాడని చెప్పారు. తనపై ఆరోపణలు చేసిన వాళ్లు తిరుమలకు వస్తే ప్రమాణానికి సిద్ధమని స్పష్టం చేశారు.

### కేసులకు భయపడి రాజీనామా చేయలేదు

కేసులకు భయపడి రాజకీయాల నుంచి తప్పుకుంటున్నారని వచ్చిన ఆరోపణలపైనా విజయసాయిరెడ్డి స్పందించారు. రాజకీయాల నుంచి తప్పుకుంటే ఇంకా బలహీనుడిని అవుతానని చెప్పారు. అలాంటప్పుడు కేసులు ఎందుకు మాఫీ చేస్తారని ప్రశ్నించారు. తాను రాజకీయాల్లోకి వచ్చినప్పటికీ, ఇప్పటికీ పరిస్థితులు వేరని అన్నారు. రాజ్యసభ ఎంపీగా అటు రాష్ట్రానికి, ఇటు పార్టీకి న్యాయం చేయలేనని వ్యాఖ్యానించారు. రాజీనామాలో ఎవరి ఒత్తిడి లేదని.. ఎవరికీ భయపడే తత్వం తనది కాదని స్పష్టం చేశారు.

### గుండెపోటు అని ఎందుకు చెప్పానంటే..

వైఎస్ వివేకానంద రెడ్డికి గుండెపోటు అని ఎందుకు అబద్ధం చెప్పారని మీడియా అడిగిన ప్రశ్నకు కూడా విజయసాయి రెడ్డి వివరణ ఇచ్చారు. వైఎస్ వివేకానంద చనిపోయినట్లు ఒక వ్యక్తి తనకు ఫోన్ చేసి చెప్పారని అన్నారు. ఆ విషయం తెలియగానే తాను ఆశ్చర్యపోయానని అన్నారు. వెంటనే పులివెందులలో ఉన్న అవినాశ్ రెడ్డికి ఫోన్ చేస్తే గుండెపోటు అని చెప్పారని అన్నారు. తనకు ఫోన్‌లో చెప్పిన విషయాన్నే మీడియా ముందు చెప్పానని వివరించారు.



## యువ ఓటర్లు తప్పనిసరిగా ఓటర్లుగా నమోదు కావాలి

### ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి

**జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య**




**కర్నూలు, మహా :** యువ ఓటర్లు తప్పనిసరిగా ఓటర్లుగా నమోదు కావాలని, అదే విధంగా ఓటర్లు అందరూ ఓటు హక్కును తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య స్పష్టం చేసారు. శనివారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో నిర్వహిస్తున్న జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, జిల్లా అధికారులు, వివిధ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్షన్ కమీషన్ ఆఫ్ ఇండియా 1950వ సంవత్సరంలో ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. 2011వ సంవత్సరంలో మొదటి సారిగా జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జనవరి 25న నిర్వహించుకోవాలని క్యాబినేట్ లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ గారు ప్రతిపాదించడం జరిగిందన్నారు. ఎవరి క్రింద బానిసత్వం ఉండకుండా మన దేశాన్ని మనమే పరిపాలించుకోవాలనే ఉద్దేశ్యంతో రాజ్యాంగాన్ని రూపొందించుకోవడం జరిగిందన్నారు. ఈ రాజ్యాంగం రూపొందించడానికి ఎన్నో సంప్రదింపులు, సమావేశాలు నిర్వహించి తయారు చేసుకోవడం జరిగిందన్నారు. త్వరలోనే వన్ బిలియన్ ఓటర్లు నమోదు అయ్యే అవకాశం ఉందన్నారు. దేశ వ్యాప్తంగా 65 శాతం ఉందని, అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 80 శాతం ఓటింగ్ శాతం ఉందన్నారు. ఓటర్లుగా మన బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. స్పెషల్ సమ్మర్ రివిజన్ లో భాగంగా జనవరి 5వ తేదీన పబ్లిష్ చేశామని, దానికి ముందు డ్రాఫ్ట్ ఎలక్ట్రోల్ రోల్, ఫైనల్ ఎలక్ట్రోల్ రోల్ తయారు చేసుకోవడం జరిగిందని, ఈ స్పెషల్ క్యాంపెయిన్ ల ద్వారా యువ ఓటర్ల నమోదు చేయడం జరిగిందన్నారు. అందుకు బిఎల్ఓలు ఏర్పాటు చేసి, సదరు కార్యక్రమంపై ప్రచారం కల్పించడం జరిగిందన్నారు. యువ ఓటర్ల క్రింద తప్పనిసరిగా నమోదు చేయాలనే సదుద్దేశ్యంతో ప్రాస్పెక్టివ్ ఓటర్లుగా (భావి తరాల) 17 సం.లు దాటిన వెంటనే నమోదు చేసుకుంటే 18సం.లు పూర్తి కాగానే ఓటర్ల జాబితాలో నమోదు అయ్యే అవకాశం ఉంటుందన్నారు. అందుకు ఫామ్6 ద్వారా కొత్త ఓటర్లు నమోదు అయ్యే అవకాశం ఉంటుందని, ఎవరైనా చనిపోతే వారిని ఫారం7 తొలగించడం కోసం స్పెషల్ సమ్మరీ రివిజన్ చేసి ఎలెక్ట్రోల్ రోల్ పురిఫికేషన్ చేసుకోవడం జరుగుతుందని, అదే విధంగా ఫారం8 ద్వారా ఓటు హక్కును ఒక ప్రాంతం నుండి ఇంకొక ప్రాంతానికి షిఫ్ట్ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు.

## మెగా జాబ్ మేళ నిర్వహించిన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి




**కర్నూలు, మహా :** కర్నూలు పట్టణం స్థానిక నంద్యాల చెక్ పోస్ట్ దేవి ఫంక్షన్ హాల్ లో పాణ్యం ఎమ్మెల్యే శ్రీమతి గౌరు చరిత రెడ్డి ఆధ్వర్యం లో సుప్రసిద్ధ అమర్ రాజా గ్రోత్ కారిడార్ కంపెనీ మరియు మెడ్ ప్లస్ ఫార్మా కంపెనీ లలో ఉద్యోగాలకు సంబంధించి నిరుద్యోగ యువతి,యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగింది.. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకొని భావితరాలకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. ఎందరో నిరుద్యోగులు నైపుణ్యం ఉండి కూడా నిష్ప్రయోజనంగా ఉండకూడదన్న లక్ష్యంతోనే తమ ప్రభుత్వం మెగా జాబ్ మేళాను నిర్వహిస్తుందని, ఇందులో వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఈ ఇంటర్వ్యూలకు భారీ ఎత్తున యువతి యువకులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో ఉమ్మడి జిల్లా టీడీపీ సీనియర్ నాయకులు నంది కొట్కూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి,గౌరు వెంకట రెడ్డి పాణ్యం నియోజకవర్గం యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తం రెడ్డి ,కేవీఎస్ఆర్ విద్యా సంస్థల అధినేత కే వీ సుబ్బా రెడ్డి ,పుల్లయ్య ఇంజనీరింగ్ విద్యా సంస్థల అధినేత పుల్లయ్య, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్ , వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణ పల్లె నాగిరెడ్డి ,రాయలసీమ విద్యార్థి విభాగం అధ్యక్షుడు శ్రీ రాములు ,తెలుగు యువత అధ్యక్షుడు జవ్వాజి గంగాధర్ గౌడ్, అర్బన్ నాయకులు జనార్ధన్ ఆచారి తదితరులు పాల్గొన్నారు

## దావోస్ నే ఇక్కడకు తెస్తామన్నారు.. ఏమైంది చంద్రబాబు ?'

- మైదుకూరు వ్యక్తికి కోటు వేసి చర్చలు జరపారంటూ ఎద్దేవా
- కడప జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి ఫైర్
- రాష్ట్రంలో పరిపాలన అనేది లేదు
- ఏపీలో ఎక్కడ చూసినా దురాగతాలు, గంజాయి, పేకాట క్లబ్బ పాలనే




**కడప, మహా:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరిపాలన అనేది లేదని కడప జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు రవీంద్రనాథ్రెడ్డి విమర్శించారు. కడపలో మీడియాతో మాట్లాడిన ఆయన ఏపీలో ఎక్కడ చూసినా మహిళలపై దురాగతాలు, గంజాయి, పేకాట క్లబ్బ పాలనే సాగుతోందన్నారు. మట్టి నుంచి ఇసుక వరకూ దోచుకు తింటున్నారని ధ్వజమెత్తారు. ఇంతటి దుష్ట దుర్మార్గ పరిపాలన గతంలో ఎప్పుడూ చూడలేదన్న రవీంద్రనాథ్ రెడ్డి దావోస్ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఏమి తెచ్చాడని ప్రశ్నించారు. దావోస్ నే ఇక్కడకు తెస్తానంటూ ప్రగల్బాలు పలికిన చంద్రబాబు.. మైదుకూరు వ్యక్తికి కోటు వేసి చర్చలు జరపారని ఎద్దేవా చేశారు. వీళ్ల చేతగానితనానికి కూడా జగనే కారణమంటూ మాట్లాడటం విడ్డూరమన్నారు. ప్రజలందరికీ వీళ్ల చేతగానితనం, మోసం అర్థమవుతోందని, వైఎస్ జగన్ ఉంటే బాగుండేదని ప్రజలు ఆలోచిస్తున్నారన్నారు. మత్స్యకార భరోసా, అమ్మ ఒడి వంటి అనేక పథకాలకు ప్రస్తుత ప్రభుత్వం పంగనామాలు పెట్టిందని రవీంద్రనాథ్ రెడ్డి మండిపడ్డారు. కేవలం వైఎస్సార్సీపీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టడం తప్ప వీళ్లు చేసింది ఏమీ లేదని విమర్శించారు. వీళ్ల పరిపాలనకు దావోస్ పర్యటన నిదర్శమని, అక్కడ కూడా రెడ్బుక్ రాజ్యాంగం తెలిసిపోయిందన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సినవి వచ్చే వరకూ తాము ప్రజాపోరాటాలు చేస్తామని రవీంద్రనాథ్ రెడ్డి స్పష్టం చేశారు.




**అఖిలభారత అగ్రగామి మహిళా సమితి**

## ప్రధమ రాష్ట్ర మహాసభ లను జయప్రదం చేయండి

**కడప మహా న్యూస్ జనవరి 25 , మహా :** అఖిల భారత అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర మొదటి మహాసభలు ఫిబ్రవరి 12 13 తేదీలలో కడప నగరంలో అన్ని ఐఎంఏ హాల్లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి వి సుందర రామరాజు చెప్పారు. కడపలో మీడియాతో మాట్లాడిన ఆయన ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా దగ్గరగా మీ మహిళా సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎం.యల్.ఏ పూర్ణిమ బిశ్వాస్, జాతీయ కమిటీ సభ్యురాలు పి ఎస్ ఆర్ ఎస్ ప్రవళికలు హాజరుకానున్నట్లు ఈ మహాసభలకు రాష్ట్ర నలుమూల నుండి మహిళ ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ 1939 సంవత్సరంలో ఈ దేశానికి సత్యాగ్రహాలతో నిరాహార దీక్షలతో స్వాతంత్రం సిద్ధించదని, సాయుధ పోరాటంతో మాత్రమే ఈ దేశానికి స్వాతంత్రం సిద్ధిస్తుందని నేతాజీ ఇండియన్ నేషనల్ ఆర్మీ ఐ ఎన్ ఏ లో మహిళలకు స్థానం కల్పించడం కోసం "ఝాన్సీ లక్ష్మి సేన" పేరుతో కెప్టెన్ లక్ష్మి సైగల్ సారధ్యంలో మహిళా సాయుధ తిరుగుబాటు నిర్మాణం జరిగిందన్నీరు. కాలక్రమంలో ఐఎన్ఏ సైన్యం 1943 అక్టోబర్ 26 నాటికి ఆజాద్ హింద్ ఫౌజ్ ఏ హెచ్ ఎఫ్ ప్రభుత్వం ప్రకటన చేయడం 1943 డిసెంబర్ 30న అండమాన్ నికోబార్ దీవులలో ఆజాద్ హింద్ ఫౌజ్ నూతన భారత ప్రభుత్వాన్ని స్థాపించడం జరిగింది. కార్యక్రమంలో రెండవ ప్రపంచ యుద్ధ పరిణామాల నేపథ్యంలో 1947లో బ్రిటిష్ వారు, వలసలను వదులుకొని నేతాజీ భయంతో ఈ దేశానికి షరతులతో కూడిన స్వాతంత్రం ప్రకటించడం జరిగిందనీ వారు పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు, మహిళలకు ఆస్తి హక్కు,అంటరానితనం విద్యా,ఉపాధి,ఉద్యోగాలకు రిజర్వేషన్లు కల్పించాలని , మహిళలపై అత్యాచారాలును నిరోధించడం, చట్టసభలలో సగభాగం ప్రాతినిధ్యం కల్పన కోసం కులము,ప్రాంతీయ ఏర్పాటు వాద తత్వాలకు వ్యతిరేకంగా పోరాటాలు సాగిస్తున్నదన్నారు. ఈ మహాసభలలో రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకునేందుకు ఈ మహాసభలు వేదిక కానున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు సుబ్బమ్మ, హిమబిందు, అరుణ కుమారి లు పాల్గొన్నారు.

## ఓటు హక్కు ఓ వజ్రాయుధం

- ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యత
- 18 సం. లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును నమోదు చేసుకోవాలి
- 15 వ జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ డా. శ్రీధర్




**కడప, జనవరి 25, మహా :** ప్రపంచంలోనే అతి పెద్దప్రజాస్వామ్య దేశమైన మన దేశంలో ఓటు హక్కు ఓ వజ్రాయుధమని, తన ఓటు హక్కుతో దేశాన్ని శాసించగల శక్తి ఓటర్లందరికీ ఉందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ లోని సభాభవన్ లో 15 వ జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదిగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి హాజరు కాగా, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు,ఆర్డీవో జాన్ ఇర్విన్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ...దేశంలో పార్లమెంట్, అసెంబ్లీలకు ప్రజాప్రతినిధులను ఎన్నుకునే ఎంతో విలువైన ఓటరుకు ఓ ప్రత్యేక స్థానం ఉందన్నారు. స్వాతంత్రం వచ్చిన నాటి నుండి ప్రజాస్వామ్య విలువలను చాటుకుంటూ ప్రపంచ దేశాలకు మన దేశం గీటురాయిగా నిలిచిందన్నారు.అనేక మంది వారి స్వాతంత్ర సమరయోధులు తమ జీవితాలను త్యాగం చేసి భారతదేశానికి స్వాతంత్రాన్ని తీసుకొని వచ్చారని అన్నారు.ఈ స్వతంత్ర దేశంలో పౌరులందరికీ కుల, మత, భాష,లింగ, అక్షరాస్యులు, నిరక్షరాశులు, థర్డ్ జెండర్ అనే తారతమ్యాలు లేకుండా ప్రజాస్వామ్యబద్ధంగా 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కును రాజ్యాంగం ప్రసాదించిందన్నారు.18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ విలువైన ఓటును నమోదు చేసుకోవాలని ఎప్పుడు ఎన్నికలు వచ్చినా నిష్పక్షపాతంగా ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా మన విధిగా బాధ్యతాయుతంగా వినియోగించుకుని ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కొత్త ఓటర్ల నమోదుపై ఓటుహక్కును అందరికీ కల్పించేందుకు ప్రతి ఏటా ఎన్నికల సంఘం విస్తృతంగా ప్రచారం చేస్తూ ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. అందులో మనం బాగస్వాములమై ఓటరు నమోదు పై అవగాహన పెంచాలన్నారు. అంతకుముందు జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని... జ్యోతి ప్రజ్వలన చేశారు.అనంతరం ముద్ర అకాడమీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

## అంగన్వాడీ స్కూల్ అభివృద్ధికి భారతి సిమెంట్స్

### సహకారం అందించడం అభినందనీయం కమలాపురం ఎమ్మెల్యే చైతన్య రెడ్డి



**కడప, మహా:** అంగన్వాడీ స్కూల్ అభివృద్ధికి భారతి సిమెంట్స్ సహకారం అందించడం అభినందనీయం కమలాపురం ఎమ్మెల్యే చైతన్య రెడ్డి ప్రసంశించారు. శనివారం భారతి సిమెంట్స్ అధికారులతో కలిసి ఆయన అంగన్ వాడి కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్యం, హాస్పెటల్స్ , డ్రైనేజీ, సీసీ రోడ్లు, స్కూల్స్ అభివృద్ధి చేస్తున్న తరుణంలో భారతి సిమెంట్స్ యాజమాన్యం అభివృద్ధి కి తమ వంతు కృషి చేసేందుకు ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. అంతే కాకుండా నగర పంచాయతీలో, మండలం లో స్వచ్ఛ సేవ కార్యక్రమంలో భాగంగా టాయిలెట్స్, గ్రామాల అభివృద్ధికి సహకారం అందించాలి భారతి సిమెంట్స్ యాజమాన్యాన్ని కోరారు.

# సూపర్ సిక్స్ - సూపర్ ఫ్లాప్

- ఎన్నికల్లో చెప్పిన హామీలన్నీ నెరవేర్చాలి...కడప కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి



**కడప, మహా :** ఎన్నికల ముందు కూటమి చెప్పిన హామీలన్నీ నెరవేర్చాలని కడప కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి ,పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ధ్రువకుమార్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. శనివారం పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిలా రెడ్డి ఆదేశాల మేరకు థాలీ భజావో కార్యక్రమం పేరిట జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్లేట్లు స్పూన్లతో శబ్దం చేస్తూ మొద్దు నిద్రలో ఉన్న కూటమి ప్రభుత్వాన్ని నిద్రలేపే ప్రయత్నాన్ని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి నేటికి 227 రోజులని, ఇప్పటి వరకు సంక్షేమ పెన్షన్లు, ఉచిత గ్యాస్ తప్ప ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, పథకాలను అమలు చేయలేదన్నారు. కమిటీలతో, ప్రణాళికలతో కాలయాపన చేస్తున్నారని, బాబు షూరిటీ.... భవిష్యత్తు గ్యారంటీ అని... బాబు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా మూలన పెట్టారన్నారు. కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వకపోవడంతో పేద విద్యార్థులు అర్థాంతరంగా చదువులకు దూరం అవుతున్నారని, సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులను వేధిస్తున్నాయని విజయ జ్యోతి మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే దాదాపు రూ.4 వేల కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయాల్లో 40 సంవత్సరాల అనుభవం ఉందని, నాలుగో సారి ముఖ్యమంత్రి అయ్యానని, 1995 నుండి దావోస్ కి వెళుతున్నానని గొప్పలు చెప్పుకున్న చంద్రబాబు ఆంధ్ర ప్రదేశ్ కు ఒక్క పెట్టుబడి కూడా ఆకర్షించలేకపోయారని విమర్శించారు. రాష్ట్రంలో కేంద్ర ప్రాయోజిత పథకాలు, గత ప్రభుత్వం అమలు చేసిన కొన్ని పథకాలు అమలు చేయడం మినహా కూటమి ప్రభుత్వం కొత్తగా ఒక్క పథకం కూడా అమలు చేయలేదు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, పిసిసి ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, నియోజకవర్గ కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | జిల్లా వార్తలు | DISTRICT NEWS | ఆదివారం, హైదరాబాద్ | 26-01-2025
ANN తెలుగు

# మన జీవితానికి మనమే భద్రత

- రోడ్డు భద్రత నియమావలిని ప్రతి ఒక్కరు పాటించాలి
- తప్పు చేస్తూ ఎదుటి వారు ప్రాణాలు తీసే హక్కు ఎవరికీ లేదు



**ములుగు, మహా :** రోడ్డు భద్రత నియమావళిని ప్రతి ఒక్కరూ పాటిస్తూ ప్రమాదాలకు చోటు ఇవ్వద్దని, మన జీవితానికి మనమే భద్రత అని గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శనివారం ఉదయం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా 3 కిమి రన్నింగ్ పోటీలు సాధన స్కూల్ నుండి ములుగు బస్టాండ్ యూటర్న్ నుండి సాధన స్కూల్ వరకు నిర్వహించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పో రిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ పైడాకుల అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ నాణ్యమైన ఆహారాన్ని తీసుకుంటూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరంగా ఉండాలని, సహజ సిద్ధమైన కూరగాయలను తీసుకోవాలని అన్నారు. తప్పులు చేస్తూ ఎదుటి వారి ప్రాణాలను తీసి హక్కు ఎవరికీ లేదని, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ నియంత్రణ అలవర్చు కోవాలని సూచించారు. నేడు అధిక సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు తప్పు దారులలో వాహనాలను నడపటం, అధిక వేగం, హెల్మెంట్ ధరించకపోవడం, మద్యం సేవించి వాహనాలను నడపడం వలన ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతో విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో గత సంవత్సరం నాలుగు లక్షల 70 వేల రోడ్డు ప్రమాదాలు జరగగా లక్ష 73 వేల మంది ప్రాణాలు కోల్పోయారని, మన జిల్లాలో 45 మంది మృత్యువాత పడ్డారని అన్నారు. రోడ్డు భద్రత నియమావళి పై మండలాల వారీగా అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. 20 సంవత్సరాలు నిండిన యువతి, యువకులకు మాత్రమే తల్లిదండ్రులు వాహనాలు ఇప్పించాలని, తినే తిండి పీల్చే గాలి స్వచ్ఛంగా ఉంటేనే ఆరోగ్యకరంగా ఉంటారని అన్నారు. ఆరోగ్యాన్ని కాపాడే కషాయాన్ని సైతం తీసుకోవచ్చని, ఆరోగ్యకరంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని అన్నారు. నేటి రోజులలో రోడ్డుపై లభించే తినుబండారాలను విచ్చల విడిగా తినడం వలన చిన్నపిల్లలకు సైతం గుండె జబ్బులు క్యాన్సర్ లాంటి వ్యాధులు వస్తున్నాయని, ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలలో సహజసిద్ధమైన కూరగాయలను సాగు చేయాలని అన్నారు. రానున్న రోజులలో జిల్లాలో ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ ములుగు జిల్లా గిరిజన ప్రాంతంతో కూడి ఉందని, రోడ్డు భద్రత నియమావళిని పూర్తిగా అవగాహన చేసుకున్న అనంతరమే వాహనాలు నడపాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, రోడ్డు భద్రతా నియమావళిని పాటించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. మాట్లాడుతూ తాను కళాశాల లో విద్యను అభ్యసిస్తున్న సమయంలో రోడ్డు నియమావళిని పూర్తిస్థాయిలో అవగాహన చేసుకున్నానని, ప్రతి ఒక్కరి జీవితం ఎంతో విలువైనదని అన్నారు. జీవితం పోతే తిరిగి రాదని, రోడ్డు ప్రమాదాలలో విలువైన ప్రాణాన్ని తీసుకోవద్దని వికలాంగులుగా మారవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు శాఖ అధికారులు, సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, యువతి యువకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# బాధలో బాసటగా..

## కంది మౌనా శ్రీనివాస రెడ్డి పరామర్శలు..రెండు కుటుంబాలకు ఆర్థిక సాయాలు









**ఆదిలాబాద్ మహా:** ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్నవారిని, అనారోగ్యంతో బాధపడుతున్నవారిని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి సతీమణి కంది మౌనా శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. ఆదిలాబాద్ రూరల్ మండలం పరిధిలోని యాపలగూడ గ్రామాన్ని కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సందర్శించిన ఆమె పలువురిని ఈ సందర్భంగా పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో శనిగారపు చిన్నక్క, చుంచు రాజవ్వ మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ఆర్థికసాయం అందజేశారు. అదే విధంగా తోన్పుల లసుమ్ బాయి అనారోగ్యంతో మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అటు అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త తక్సండే బలిరామ్, గ్రామస్తులు ఉష్కమల్ల నారాయణ, తక్సండే గంగారామ్‌ను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ రూరల్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అల్చెట్టి నాగన్న, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు, గ్రామస్తులు మామిల్ల భూమయ్య, సార్ల సత్యనారాయణ, అరిగేల కిష్టయ్య, నాయకులు సుధాకర్ గౌడ్, ఎల్మ రామ్ రెడ్డి, దొగ్గలి రాజేశ్వర్, మహమ్మద్ రఫీక్, రావుల సోమన్న, మహిళా నాయకురాలు దేశెట్టి ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.



# పూర్వ విద్యార్థి ఉదారత

ఆదిలాబాద్ మహా : బోథ్ మండలం లోని కనుగుట్ట గ్రామానికి చెందిన గడ్డల నారాయణ తాను చిన్నతనంలో చదివిన పాఠశాలకు ఉపయోగకరంగా ఉండేందుకు ఏదైనా ఇవ్వాలనుకున్నాడు. మైక్ సెట్ అందించి తన ఔదార్యాన్నిచాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనుగుట్ట పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థిగా గుర్తుండేందుకు ఒక వస్తువు ఇచ్చానన్నారు.అంతేకాదు పిల్లలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చిన పాఠశాల అభివృద్ధి కోసం సహాయం చేయడానికి ఎల్లవేళలా ముందుంటానని తెలిపారు.పిల్లలకు అన్ని రకాల వసతులు కల్పించి నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో మండల విద్యాధికారి కుమ్మరి పోశెట్టి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి,కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇదాపు నారాయణ, రిటైర్డ్ ఉపాధ్యాయులు పోశెట్టి, వీడీసీ చైర్మన్ నవ్వ రవీందర్,పాఠశాల ఉపాధ్యాయులు మహేష్, జీవీ.రమణ, ఇతర సిబ్బంది, వీడీసీ పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

## గవర్నర్ చేతుల మీదుగా ఉత్తమ అధికారిగా ప్రశంస



ములుగు, మహా : ఉత్తమ సహాయ ఎన్నికల ఓటర్ నమోదు అధికారిగా భారత ఎన్నికల సంఘం రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర ఎన్నికల అధికారి గుర్తింపు దక్కించుకున్న ములుగు తాసిల్దార్ విజయభాస్కర్ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా శనివారం ప్రశంస పత్రం అందుకున్నారు. శనివారం హైదరాబాదులో 15వ జాతీయ ఓటర్ దినోత్సవం పురస్కరించుకొని ఉత్తమ ఎన్నికల విధానాలను అనుసరణగా భాగంగా ములుగు తాసిల్దార్ ఈ గౌరవాన్ని పొందారు.



## తాగిన మైకంలో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**ఆదిలాబాద్ మహా :** అదిలాబాద్ జిల్లా బోథ్ మండలం లోని నిగిని గ్రామానికి చెందిన రాథోడ్ అర్జున్ (37) అనే వ్యక్తి గత కొంతకాలంగా మద్యానికి బానిసై ఇంట్లో ఎవరు లేని సమయం చూసి మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి ఆయన భార్య మేనక స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు .

## ఓఎస్డి ముందు లొంగిపోయిన మావోయిస్టు పార్టీ దళ సభ్యురాలు



**ములుగు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీకి చెందిన మావోయిస్టు దళ సభ్యురాలు మడవి మంగ్లీ అలియాస్ నవ్య శనివారం ములుగు ఓఎస్ డి గీతే మహేష్ బాబాసాహెబ్ ఎదుట లొంగిపోయింది. ఓఎస్డీ మంగ్లీ లొంగుబాటు వివరాలను మీడియాకు వెల్లడించారు. మంగ్లీ 2018 నుండి నేటి వరకు పలు ఎదురుకాల్పుల్లో పలువురిని హత్య చేసిన సంఘటనలో నిందితురాలని ఆయన పేర్కొన్నారు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి మలేషియా కమాండర్ ప్రోత్సాహంతో మొదట సభ్యురాలుగా 2018 లో మావోయిస్టు పార్టీ లో చేరిన మంగ్లీ పార్టీలో పని చేస్తూనే దళ కమాండర్ని వివాహం చేసుకుంది. పుట్టపాడు అడవుల్లో జరిగిన ఎన్ కౌంటర్లో మంగ్లీ భర్త రాజేష్ చనిపోయాడు. కాలం చెల్లిన సిద్ధాంతాలతో మావోయిస్టు పార్టీలో కొనసాగుతూ ఏమీ సాధించలేరని, స్వచ్ఛందంగా లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని ఈ సందర్భంగా ఎస్పీ శబరిష్, ఓఎస్డి గీతే మహేష్ బాబా సాహెబ్ పిలుపునిచ్చారు.


# నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి




## జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**ములుగు , మహా :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్లు నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. ఓటును మించి ఏమీ లేదు .. నేను కచ్చితంగా ఓటు వేస్తాను.. అనే నినాదంతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిఎస్, రెవెన్యూ అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి, స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ సంపత్ రావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య ఎన్నికల్లో ఓటర్లను భాగస్వామ్యం చేసేందుకు ఓటింగ్ ప్రాముఖ్యత ప్రతి ఒక్కరికి తెలియజేయడం కోసం జనవరి 25వ తేదీని జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు కుల మతాలకు రాగద్వేషాలకు అతీతంగా నిష్పక్షపాతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. 18 సంవత్సరాల నిండిన యువతి యువకులు తప్పనిసరిగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్క ఓటరు బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవడం జాతీయ ఓటర్ల దినోత్సవ ప్రధాన ఉద్దేశం అని ఓటు హక్కు ప్రాముఖ్యతపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో రెవెన్యూ ఉద్యోగుల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారి రంపతి, డిసిఓ సర్దార్ సింగ్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి తులా రవి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కలెక్టర్ దివాకర టిఎస్, ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్ర, అదనపు కలెక్టర్లు సంపత్ రావు, మహేందర్ జీలు పాల్గొన్నారు. జనవరి 26న ఎంపిక చేసిన గ్రామాల్లో మధ్యాహ్నం 1 గంటకు అధికారికంగా ప్రారంభించాలని సిఎస్ సూచించారు. గ్రామ సభలో వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి అర్హులకు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పథకాలు అందేలా చూడాలన్నారు.

# మంచిర్యాల జిల్లా అధ్యక్ష్య పదవి ఎస్.సి లకు ఇవ్వాలి



### జిల్లా బిజెపి నాయకుల విన్నపం

మంచిర్యాల మహా : మంచిర్యాల జిల్లాలో భారతీయ జనతా పార్టీ బలపడాలంటే జిల్లా అధ్యక్ష పదవి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాయకులకు ఇవ్వాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి డిమాండు చేశారు. శనివారం బెల్లంపల్లి లో బిజెపి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచిర్యాల జిల్లాలో సుమారు ఆరు లక్షల మంది ఓటర్లు ఉంటే అందులో మూడు లక్షల ఓటర్లు దళితులే ఉన్నారని అన్నారు. జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో రెండు బెల్లంపల్లి, చెన్నూరు ఎస్సీ లకు రిజర్వ్ చేయబడ్డాయని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ కూడా ఎస్సీలకే రిజర్వు అయిందన్నారు. పార్లమెంట్ పరిధిలోని ధర్మపురి నియోజకవర్గం కూడా ఎస్సిలకే రిజర్వ్ అయిందన్నారు. పార్లమెంట్ పరిధిలో సగం ఓటర్లు దళితులే ఉన్నారని అన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తే ఆ సామాజికవర్గం బీజేపీలో చేరుతారని చెప్పారు. ఇప్పటివరకు ఉన్నత వర్గాలకు మాత్రమే ఆ పదవి దక్కిందని చెప్పారు. బిజెపి జాతీయ, రాష్ట్ర నాయకత్వం సామాజిక సమతుల్యత పాటిస్తామని, అధ్యక్ష పదవుల్లో దళితులకు, ఎస్టీలకు, మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్తున్నారని, పార్టీ పదవుల్లో వారికే బాధ్యతలు అప్పగించి పార్టీని విస్తరించాలని కోరారు. పార్టీ కోసం పని చేసే వారికే బాధ్యతలు ఇవ్వాలని, పైరవీలు చేసే వారిని పక్కన పెట్టాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో దళితులకు బాధ్యతలు అప్పగిస్తే రాబోయే ఎన్నికల్లో బిజెపి మూడు నియోజక వర్గాల్లో గెలుస్తుందన్నారు. పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకత్వం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని, మంచిర్యాల జిల్లా అధ్యక్షులుగా దళితున్ని నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్సీ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివాజి, జిల్లా అధ్యక్షులు కోడి రమేష్, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, కార్యదర్శి నవీన్, సురేష్, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేశవ్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి క్ర్ కృష్ణ దేవరాయలు, సీనియర్ నాయకులు అజ్మీర శ్రీనివాస్, మహిళా మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి కమల, న్యాయవాది సంగీత, స్రవంతి, జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రావణ్, రాములు , సదానందం తదితరులు పాల్గొన్నారు.




## రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

**- జిల్లా ఎస్పీ గౌష్ ఆలం**

**ఆదిలాబాద్ మహా :** ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వద్ద నుండి ఆర్టిఏ కార్యాలయం వరకు రెండు కిలోమీటర్ల పరుగును చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ముఖ్యఅతిథిగా విచ్చేసి 2k రన్ ను జెండా ఊపి ప్రారంభించారు. స్వయంగా ఆయన రెండు కిలోమీటర్ల పరుగులో పాల్గొని యువతను ఉత్సాహపరిచి 2కే రన్‌ను విజయవంతం చేశారు.అంతకుముందు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా రోడ్డు భద్రతా నియమాలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ను తప్పకుండా ధరించాలని, మద్యం సేవించి వాహనాలను నడపవద్దని, వాహనం నడిపే క్రమంలో సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలన్నారు. చివరగా రవాణా శాఖ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యువతకు ప్రశంసాపత్రాలు, అవార్డులు బహుకరించి అభినందించారు. అదేవిధంగా అవగాహన కార్యక్రమాలలో ఒకటైన హైడ్రోజన్ స్కై బెలూన్ ను కలెక్టరేట్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, ఎంవిఐలు కే రవీందర్, ప్రదీప్ గౌడ్, ఆశ్వంత్ కుమార్, ఏ ఎం వి ఐ లు విద్యాధర రెడ్డి, ప్రత్యూష, హరేంద్ర కుమార్, వినయ్, సిఐలు సునీల్ కుమార్, కరుణాకర్, ప్రణయ్ కుమార్, డి సాయినాథ్, కే పనధర్ ఎస్సైలు పోలీసు శాఖ రవాణా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలి

- రాష్ట్ర అటవీ, పర్యావరణ దేవాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ
- పాత్రికేయులకు హెల్మెట్ లను అందజేసిన మంత్రి



**వరంగల్, మహా:** రోడ్డు భద్రతా నియమాలను పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ దేవాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం సందర్భంగా శనివారం వరంగల్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో వరంగల్ లోని పోచమ్మ మైదానం నుండి ఎం జి ఎం ఆసుపత్రి వరకు నిర్వహించిన రెండు కిలోమీటర్ల ద్విచక్ర వాహన ర్యాలీ ను వరంగల్ పోలిసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూతో కలసి మంత్రి ప్రారంభించారు. స్వయంగా మంత్రి కొండా సురేఖ ద్విచక్ర వాహనాన్ని నడిపారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులకు హెల్మెట్లను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ, సిపి అంబర్ కిషోర్ ఝూ.. మాట్లాడుతూ రోడ్డు పై ప్రయాణించేటప్పుడు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ను తప్పకుండా ధరించాలని, మద్యం సేవించి వాహనాలను నడపవద్దని, వాహనం నడిపే క్రమంలో సీట్ బెల్ట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని తెలియజేశారు. ప్రమాదాలు ఎక్కువ శాతం ప్రజల నిర్లక్ష్యం తోనే జరుగుతాయని, వాటిని తగ్గించేందుకు ప్రతి వాహనదరుడు కృషిచేయాలని సూచించారు. ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్న వారు నిండు ప్రాణాలను కోల్పోతుండగా, వారి కుటుంబాలకు కూడా తీరని నష్టం కలుగుతున్నదని అన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, చిన్నచిన్న సరదాలకు పోయి నిర్లక్ష్యంతో వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడి తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చవద్దని హితవు పలికారు. రోడ్డు దుర్ఘటనలలో అత్యధికంగా ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతూ ప్రాణాలు కోల్పోతున్నారని, ఎంతోమంది క్షతగాత్రులుగా మారుతున్నారని అన్నారు. హెల్మెట్ ధరించి



వాహనాలు నడిపితే దాదాపు 90 శాతం వరకు ప్రాణాపాయం బారి నుండి తమను తాము కాపాడుకునేందుకు ఆస్కారం ఉంటుందని సూచించారు. ప్రతిఒక్కరు హెల్మెట్ ధరించడాన్ని అలవాటుగా చేసుకోవాలని, దీనిని కనీస బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. ప్రమాదాల నియంత్రణ కోసం వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ, నిబంధనల మేరకు జరిమానాలు విధించడం వంటివి చేస్తున్నప్పటికీ, ఎవరికివారు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించినప్పుడే ప్రమాదాలకు కళ్లెం వేయవచ్చని సూచించారు. హెల్మెట్ల వినియోగం అత్యావశ్యకం, సురక్షితం అనే విషయాన్ని ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించేందుకు విస్తృత స్థాయిలో కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి సూచించారు. జిల్లా పోలీసు, రవాణా వ్యవస్థ వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూనే ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏసిపి లు నందిరాం నాయక్, సత్యనారాయణ, ఇన్స్పెక్టర్లు రామకృష్ణ, తుమ్మ గోపిరెడ్డి, ఎంఏ సుకూర్, వెంకటరత్నం, ఎస్సైలు,ఎంజి ఎం సూపరింటెండెంట్ మురళి, నెహ్రూ యువ కేంద్ర అధికారి అన్వేష్, పోలీస్ శాఖ, సంబంధిత శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, తదితరులు పాల్గొన్నారు.

# టోల్ ప్లాజా కార్మికుల దీక్షలు




**నిర్మల్ మహా :** జిల్లా సోన్ మండలంలోని గంజాల్ గ్రామ సమీపంలోని టోల్ ప్లాజాలో పనిచేసే కార్మికులు దీక్షలకు దిగారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్ష కొనసాగుతోంది.ఎన్నో ఏళ్లుగా ఈ టోల్ ప్లాజాలో పనిచేస్తున్న తమను అకారణంగా తొలగించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కొందరికి ప్రస్తుతం కొనసాగుతున్న వేతనాన్ని తగ్గించి ఇస్తున్నట్లు ఆరోపించారు. ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించాలని లేనిచో కుటుంబాలతో సహా రోడ్డెక్కి నిరసన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు రమేష్, రాంగోపాల్, నవీన్, గంగాధర్, రాజు, శ్రావన్, రాజ్ కుమార్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు ఉచితాలు.. రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలు కుదేలు : ఎస్బీఐ తాజా నివేదిక




ఎన్నికల్లో ఓట్ల కోసం రాజకీయ పార్టీలు ఉచితాల పేరుతో వివిధ హామీలు గుప్పిస్తుండటాన్ని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తప్పుపట్టింది. ఇలా ఉచిత పథకాలు ప్రకటిస్తూ పోతే రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలు తీవ్ర నష్టాలను చవిచూస్తాయని పేర్కొంది. ఇప్పటికే దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లో వివిధ పేర్లతో ఈ తరహా ఉచిత పథకాలు అమలులో ఉన్నాయని, ఇలాంటి ఉచిత పథకాలతో రాష్ట్రాలు ఆర్థికంగా కుదేలవుతాయని ఎస్బీఐ అభిప్రాయపడింది. మహిళా సంక్షేమం పేరుతో వివిధ రాష్ట్రాలు అమలు చేస్తున్న నగదు బదిలీ పథకాల సునామీ ఆయా రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీస్తుందని ఎస్‌బీఐ హెచ్చరించింది. ఓట్ల కోసం, ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనం పొందే ఉద్దేశంతోనే ఈ తరహా పథకాలను కొన్ని పార్టీలు ప్రకటిస్తున్నాయని తన నివేదికలో పేర్కొంది. ఈ తరహా ఉచిత పథకాల వ్యయం దేశంలోని 8 రాష్ట్రాల్లో దాదాపు రూ.1.5 లక్షల కోట్లను దాటిందని తెలిపింది. ఆయా రాష్ట్రాలు ఆర్జిస్తున్న వార్షిక ఆదాయంలో ఈ పథకాల వ్యయం 3 నుంచి 11 శాతానికి సమానంగా ఉందని పేర్కొంది. ఒడిశా లాంటి రాష్ట్రాలు ఈ తరహా పథకాల వ్యయాలను పూడ్చుకునేందుకు పన్నేతర ఆదాయాలను పెంచుకొని, అప్పులను తగ్గించుకున్నాయని ఎస్బీఐ తెలిపింది. ఈవిధంగా ప్రణాళిక రచించుకోని కొన్ని రాష్ట్రాలు ఆర్థిక సవాళ్లను అధిగమిస్తున్నాయని పేర్కొంది. మహిళల సంక్షేమానికి ఉద్దేశించిన నగదు బదిలీ పథకాలకు నిధులను కేటాయించగల సామర్థ్యం దేశంలోని కొన్ని రాష్ట్రాలకు ఉందని, అందుకు ఒడిశాను ఉదాహరణగా తీసుకోవచ్చని వెల్లడించింది. ఒడిశాకు పన్నేతర ఆదాయాలు గణనీయంగా వస్తున్నాయని, దాంతో ఆ రాష్ట్రం కొత్తగా అప్పులు చేయడం లేదని నివేదికలో పేర్కొంది.

**రాష్ట్రాల్లో..**

కర్ణాటక రాష్ట్రంలో గృహలక్ష్మి పథకంలో భాగంగా ప్రతి కుటుంబంలో ఒక మహిళకు నెలకు రూ.2,000 అందిస్తున్నారు. ఇందుకోసం ఏడాదికి రూ.28,608 కోట్లు కేటాయిస్తున్నారు. ఇది ఆ రాష్ట్ర రెవెన్యూ రాబడుల్లో 11 శాతానికి సమానం. పశ్చిమబెంగాల్‌లో లక్ష్మీర్ భండార్ పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల మహిళలకు నెలకు రూ.1,000 చొప్పున అందిస్తున్నారు. అందుకోసం ఏటా రూ.14,400 కోట్లు వెచ్చిస్తున్నారు. ఇది ఆ రాష్ట్ర రెవెన్యూ రాబడిలో 6 శాతానికి సమానం. ఇక మహిళా సమ్మాన్ యోజన పథకం ద్వారా వయోజన మహిళలకు (కొన్ని వర్గాలకు మినహా) ప్రతినెలా రూ.1,000 చొప్పున అందిస్తామని ఢిల్లీలోని ఆప్ సర్కారు అంటోంది. ఇందుకోసం ఏటా రూ.2,000 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇది ఢిల్లీ వార్షిక రెవెన్యూ రాబడిలో 3 శాతానికి సమానం.

**ఇలా చేయండి.. ఎస్బీఐ సూచన**

రాష్ట్రాల్లో ఉచిత పథకాలకు ప్రజాదరణ పెరుగుతుండటంతో కేంద్ర ప్రభుత్వం కూడా ఆ దిశగా ఆలోచనలు చేస్తోందని ఎస్‌బీఐ నివేదిక పేర్కొంది. మహిళల కోసం ఈ విధమైన నగదు బదిలీ పథకాలను ప్రారంభించాలంటూ కేంద్ర సర్కారుపై ఒత్తిడి పెరుగుతోందని తెలిపింది. ఈ నేపథ్యంలో రాష్ట్రాలు, కేంద్రం వేర్వేరుగా కాకుండా జాతీయస్థాయిలో సార్వత్రిక నగదు బదిలీ పథకాలను అమలు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడింది. జాతీయస్థాయిలో రూపకల్పన చేసే పథకాల అమలుకు రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం సమానంగా నిధులను విడుదల చేస్తే బాగుంటుందని పేర్కొంది. సార్వత్రిక నగదు బదిలీ పథకాల అమలుతో రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోకుండా అడ్డుకట్ట వేయవచ్చని, వాటిపై రాయితీల భారాన్ని తగ్గించవచ్చని ఎస్బీఐ విశ్లేషించింది. భారీ బడ్జెట్ అవసరమయ్యే నగదు బదిలీ పథకాలను అమలు చేసే ముందు రాష్ట్ర ప్రభుత్వాలు కనీస అంచనాలు వేసుకోవాలని సూచించింది. ఉచిత హామీలను అమలు చేస్తూ రాష్ట్రాలు ఆర్థిక స్థితిగతులను విస్మరిస్తే దీర్ఘకాలంలో ఇబ్బందులు ఎదురవుతాయని ఎస్బీఐ హెచ్చరిక చేసింది.

# బంగారం @ 83,000

**రికార్డు స్థాయికి చేరుకున్న పది గ్రాముల ధర**

**న్యూఢిల్లీ, జనవరి 24:** బంగారం భగభగమండుతున్నది. ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్న పుత్తడి ధర మరో శిఖరానికి చేరుకున్నది. వరుసగా ఎనిమిది రోజులుగా పెరుగుతూ వచ్చిన గోల్డ్ ఏకంగా రూ.83 వేల మైలురాయిని అధిగమించింది. ఈ చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకోవడం ఇదే తొలిసారి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులతో దేశీయంగా డిమాండ్ ఊపందుకున్నదని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పద్రిగాముల బంగారం ధర రూ.200 ఎగబాకి రూ.83,100 పలికింది. అంతకుముందు ఈ ధర రూ.82,900గా ఉన్నది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర రూ.200 అధికమై రూ.82,700 పలికింది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ పదిగ్రాముల బంగారం ధర రూ.330 ఎగబాకి రూ.82,420కి చేరుకోగా, 22 క్యారెట్ ధర మరో రూ.300 అధికమై రూ.75,500గా నమోదైంది. బంగారంతోపాటు వెండి కూడా పరుగులు పెట్టింది. కిలో వెండి ఏకంగా రూ.500 అధికమైంది. బులియన్ మార్కెట్లో వెండి రూ.94 వేలకు చేరుకున్నది. ఇటు హైదరాబాద్‌లో కూడా వెండి రూ.1,000 అధికమై రూ.1,05,000 పలికింది.



# యూజ్డ్ కార్లలోనే మారుతి స్విఫ్ట్‌దే హవా..!

కరోనా మహమ్మారి తర్వాత అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ పర్సనల్ మొబిలిటీ వైపు మొగ్గు చూపుతున్నారు. వెసులుబాటు ఉన్నవారు కొత్త కార్లు కొనుగోలు చేస్తే, ఆ అవకాశం లేనివారు యూజ్డ్ కార్లు సొంతం చేసుకుంటున్నారు. 2024 యూజ్డ్ కార్ల విక్రయాల్లో మారుతి సుజుకి స్విఫ్ట్ మొదటి స్థానంలో నిలిచింది. దేశంలోని మెట్రో పాలిటన్ నగరాలు, నాన్ మెట్రో నగరాల పరిధిలో అత్యధికంగా 'స్విఫ్ట్ (Swift)' కారుకు డిమాండ్ ఎక్కువగా ఉందని కార్స్24ఎ స్ 'గేర్ ఆఫ్ గ్రోత్: 2024 ఇండియన్ యూజ్డ్ కార్ల మార్కెట్ నివేదిక'పేర్కొంది. మారుతి సుజుకి స్విఫ్ట్ తర్వాత హ్యుండాయ్ శాంత్రో, టాటా టియాగో ఎన్ఆర్‌జీ (Tata Tiago NRG), మారుతి సుజుకి వ్యాగన్‌ఆర్ (Maruti Suzuki WagonR) తదితర యూజ్డ్ కార్లకు గిరాకీ బాగానే ఉంది. 2023లో 46 లక్షల యూనిట్లు అమ్ముడైన యూజ్డ్ కార్ల మార్కెట్ 2030కల్లా 10.8 మిలియన్ యూనిట్లకు చేరుతుంది. యూజ్డ్ కార్ల మార్కెట్‌లో 2024లో మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీ టాప్‌లో నిలిచాయి. 2023తో పోలిస్తే గతేడాది కార్ల సేల్స్ ఐదు రెట్లు పెరిగాయి. 2023లో మాదిరిగానే 2024లోనూ యూజ్డ్ ఎస్‌యూవీ కార్లు గణనీయంగానే అమ్ముడయ్యాయి. గతేడాది మొత్తం యూజ్డ్ కార్ల విక్రయంలో ఎస్‌యూవీల వాటా 16.7 శాతంగా ఉంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోనూ యూజ్డ్ ఎస్‌యూవీ కార్లు ఫేవరెట్లుగానే ఉన్నాయి. యూజ్డ్ కార్ల విక్రయాల్లో మహారాష్ట్ర 16.4శాతం, ఉత్తరప్రదేశ్ 11.7శాతం, ఢిల్లీ 13.8 శాతం వాటా కలిగి ఉన్నాయి. కొత్త కార్ల విక్రయాలు, యూజ్డ్ కార్ల విక్రయాలకు మధ్య వ్యత్యాసం పెరుగుతోంది. సగటున కొత్త కార్ల విక్రయాలు 32శాతం వృద్ధి చెందితే, యూజ్డ్ కార్ల సేల్స్ 24 శాతంగా ఉన్నాయి. ధరలు పెరుగుతున్నా, కొనుగోలుదారులు తమ బడ్జెట్‌లోనే యూజ్డ్ కార్లు సొంతం చేసుకుంటున్నా క్వాలిటీతో రాజీ పడటం లేదని ఆ నివేదిక తెలిపింది. కరోనా మహమ్మారి తర్వాత షేర్డ్ ట్రాన్స్‌పోర్ట్‌తో పోలిస్తే సేఫ్టీ, సౌకర్యం కోసం పర్సనల్ మొబిలిటీకి ప్రాధాన్యం ఇస్తున్న వారు 12 శాతం మంది ఉంటారని ఆ నివేదిక సారాంశం.




## దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL




# కాల్పుల విరమణ ఒప్పందం


**నలుగురు మహిళా సైనికులను విడుదల చేసిన హమాస్**



ఇజ్రాయెల్ హమాస్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ఆదివారం అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. అందుకు అనుగుణంగా తమ చెరలో ఉన్న ఇజ్రాయెల్‌కు చెందిన నలుగురు మహిళా సైనికులను హమాస్ శనివారం విడుదల చేసింది. ఆ నలుగురిని మిలిటరీ యూనిఫామ్‌లో తీసుకొచ్చి రెడ్‌క్రాస్‌కు అప్పగించింది. అనంతరం వారిని ఇజ్రాయెల్‌కు తీసుకెళ్లారు. వీరిని విడుదల చేసినందుకు గానూ ఇజ్రాయెల్ సైతం 100కు పైగా పాలస్తీనియన్లను విడిచిపెట్టింది. ప్రస్తుతం విడుదలైన మహిళా సైనికులను 2023 అక్టోబర్ 7న గాజా సరిహద్దుకు సమీపంలోని వహల్ ఓజ్ మిలిటరీ బేస్ నుంచి హమాస్ బంధించి తీసుకెళ్లింది. అప్పటి నుంచి 477 రోజులుగా ఆ మహిళా సైనికులు హమాస్ చెరలోనే ఉన్నారు. కాగా, కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన తొలిరోజు గాజా నుంచి ముగ్గురు ఇజ్రాయెలీ బందీలను హమాస్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ప్రతిగా ఇజ్రాయెల్ కూడా తమ జైళ్లలో ఉన్న 100 మందికిపైగా పాలస్తీనియన్లకు విముక్తి కల్పించి వారిని రెడ్‌క్రాస్ సంస్థకు అప్పగించింది. కాగా, 42 రోజుల తొలి దశ కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా తమ చెరలో ఉన్న 2,000 మందిని ఇజ్రాయెల్ వదిలిపెట్టనుండగా.. హమాస్ సైతం తమ చెరలో ఉన్న 94 మంది బందీల్లో 33 మందికి విముక్తి కల్పించనుంది.

# గగనతలంలో కుదుపులకు లోనైన విమానం..ఆరుగురికి గాయాలు

యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఓ విమానం గాల్లో ఉండగా ఒక్కసారిగా కుదుపులకు లోనైంది. ఈ ఘటనలో సిబ్బంది సహా మొత్తం ఆరుగురు గాయపడ్డారు. దీంతో విమానాన్ని లాగోస్‌లో అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వచ్చింది. ఫ్లైట్‌రాడార్ ప్రకారం.. 245 మంది ప్రయాణికులు, ఎనిమిది మంది సిబ్బంది, ముగ్గురు పైలట్లతో యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం శుక్రవారం నైజీరియాలోని లాగోస్ నుంచి వర్జీనియాలోని వాషింగ్టన్ డల్లెస్ అంతర్జాతీయ విమానాశ్రయానికి బయల్దేరింది. టేకాఫ్ అయిన 93 నిమిషాల తర్వాత విమానం ఒక్కసారిగా కుదుపులకు లోనైంది. దీంతో ప్రయాణికులు ఒక్కసారిగా తమ సీట్లలో నుంచి ఎగిరిపడ్డారు. ఫ్లైట్‌లోని ఫుడ్, ఇతర వస్తువులు అన్నీ చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ ఘటనలో నలుగురు ప్రయాణికులు, ఇద్దరు సిబ్బంది గాయపడ్డారు. ఈ ఘటనతో విమానాన్ని లాగోస్‌కు దారి మళ్లించి అక్కడ అత్యవసరంగా ల్యాండ్ చేశారు. అనంతరం గాయపడిన ఆరుగురిని సమీపంలోని ఆసుపత్రికి తరలించినట్లు ఎయిర్‌లైన్స్ తెలిపింది. అయితే ఈ ఘటనకు గల కారణాలు తెలియరాలేదు. ఘటనకు గల కారణాలపై యూఎస్, నైజీరియా అధికారులు దర్యాప్తు చేపట్టారు.



# లాస్ ఏంజెల్స్‌లో ట్రంప్

**కార్చిచ్చు ప్రాంతాన్ని పరిశీలించిన అధ్యక్షుడు**

అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో గల సంపన్నుల నగరం లాస్ ఏంజెల్స్‌లో కార్చిచ్చు బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. హాలీవుడ్ సహా పలు ప్రాంతాల్లో వేలాది నిర్మాణాలను బూడిద చేసింది. అయితే, ఈ కార్చిచ్చు ఇంకా చల్లారడం లేదు. గాలుల తీవ్రతకు కొత్త ప్రాంతాలకు మంటలు వ్యాపిస్తున్నాయి. ఈ వైల్డ్‌ఫైర్ కారణంగా లాస్ ఏంజెల్స్ మరభూమిని తలపిస్తోంది. ఖరీదైన ఇళ్లు, కార్లు, విలువైన సామగ్రి మంటల్లో కాలిబూడిదయ్యాయి. చాలా మంది ధనవంతులు, సెలబ్రిటీలు తమ సామాన్లు, కార్లను ఇళ్లలోనే వదిలేసి బతుకుజీవుడా అంటూ సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. ఈ నేపథ్యంలో లాస్ ఏంజెల్స్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా సందర్శించారు. ఫస్ట్ లేడీ మెలానియా ట్రంప్‌తో కలిసి శుక్రవారం (అమెరికా కాలమానం ప్రకారం) అక్కడికి చేరుకున్న ట్రంప్.. కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్‌తో భేటీ అయ్యారు. కార్చిచ్చు వల్ల బూడిదైన ప్రాంతాలను పరిశీలించారు. సహాయక చర్యల గురించి గవర్నర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి అన్ని విధాలా అండగా నిలబడతామని ట్రంప్ హామీ ఇచ్చారు. ట్రంప్ పర్యటనకు సంబంధించిన వీడియోను గవర్నర్ గవిన్‌న్యూసమ్ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

# స్కూటీపై వెళ్తున్న విద్యార్థినులు


**వారిపై బోల్తాపడిన రెడీ మిక్స్ కాంక్రీట్ లారీ**





**ముంబై:** ఇద్దరు విద్యార్థినులు స్కూటీపై వెళ్తున్నారు. వేగంగా వచ్చిన రెడీ మిక్స్ కాంక్రీట్ లారీ ఒక మలుపు వద్ద అదుపుతప్పింది. అక్కడ ఆగి ఉన్న విద్యార్థినుల స్కూటీపై ఆ వాహనం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆ ఇద్దరు యువతులు మరణించారు. ఈ షాకింగ్ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మహారాష్ట్రలోని పూణే జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం పింప్రి చించ్‌వాడ్‌లోని ప్రైవేట్ కాలేజీలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు స్కూటీపై వెళ్తున్నారు. అయితే హింజావాడి నుంచి మహలుంగేకు వెళ్తున్న రెడీ మిక్స్ కాంక్రీట్ లారీ వేగంగా దూసుకువచ్చింది. హింజావాడిమాన్ రోడ్డులోని మలుపులో ఆ వాహనాన్ని గమనించిన విద్యార్థిని స్కూటీని పక్కకు తిప్పేందుకు ప్రయత్నించింది. అయితే మలుపులో అదుపుతప్పిన ఆ లారీ ఆ స్కూటీపై బోల్తాపడింది. ఈ నేపథ్యంలో స్కూటీపై ఉన్న ఆ యువతులు రెడీ మిక్స్ కాంక్రీట్ లారీ కింద నలిగి అక్కడికక్కడే మరణించారు. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్రేన్స్‌ను రప్పించి బోల్తాపడిన కాంక్రీట్ లారీని పైకిలేపారు. దాని కింద నలిగి మరణించిన విద్యార్థినుల మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరోవైపు మృతులను 21 ఏళ్ల ప్రాంజలి యాదవ్, 22 ఏళ్ల ఆశ్లేషా గవాండేగా పోలీసులు గుర్తించారు. వారిద్దరూ ప్రైవేట్ కాలేజీలో బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (బీసీఏ) చివరి సంవత్సరం చదువుతున్నట్లు తెలిపారు. లారీ డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన షాకింగ్ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# అక్రమంగా పెయిన్ కిల్లర్స్ విక్రయం..

**మణిపూర్ మహిళ అరెస్ట్**



అక్రమంగా పెయిన్ కిల్లర్స్ అమ్ముతున్న ఓ 30 ఏళ్ల మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె నుంచి పెయిన్ కిల్లర్స్, నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపర్చగా కోర్టు పోలీస్ కస్టడీ కి అప్పగించింది. పెయిన్ కిల్లర్స్ విక్రయించిన మహిళ మణిపూర్ వాసిగా పోలీసులు గుర్తించారు. తమిళనాడు రాజధాని చెన్నైలో చెన్నై పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మణిపూర్‌కు చెందిన ఉంగ్లియాచింగ్ అలియాస్ రెబెక్కా చెన్నైలోని తిరువాన్‌మియూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా పెయిన్ కిల్లర్స్ విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. తిరువాన్‌మియూర్ పోలీసులు మాటు వేసి ఆమెను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పోలీసుల విచారణలో ఆమె మణిపూర్‌లోని కుకీ తెగ ప్రాబల్యంగల చురాచంద్‌పూర్ జిల్లా సింఘాట్ ప్రాంతానికి చెందిన మహిళగా తేలింది. రెబెక్కాను అరెస్ట్ చేసిన పోలీసులు ఆమె నుంచి టాపెంటడోల్ హైడ్రోక్లోరైడ్ ట్యాబ్లెట్‌లను, రూ.1,650 నగదును, ఒక ఐఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆమె ఆన్‌లైన్‌లో పెయిన్ కిల్లర్స్‌ను కొనుగోలు చేసి, కొరియర్ ద్వారా తెప్పించుకుని చెన్నైలో విక్రయిస్తున్నట్లు పోలీసులు విచారణలో తేలింది. అరెస్ట్ చేసిన తర్వాత రెబెక్కాను కోర్టులో హాజరుపర్చగా కోర్టు ఆమెకు పోలీస్ కస్టడీ విధించింది. రెబెక్కా నుంచి మరింత సమాచారం రాబట్టడం కోసం దర్యాప్తు కొనసాగుతున్నదని పోలీసులు తెలిపారు.




# మహా పత్రిక

WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | ఆదివారం, హైదరాబాద్ | 26-01-2025




## హైదరాబాద్ కమిషనర్ చేతుల మీదుగా కానిస్టేబుల్ టైటిల్ సాంగ్ రిలీజ్

కొత్త బంగారు లోకం, హ్యాపిడేస్, కుర్రాడు సినిమాలతో టాలీవుడ్ ఇండస్ట్రీని షేక్ చేశాడు నటుడు వరుణ్ సందేశ్. అయితే ఈ సినిమాలు ఇచ్చిన బ్రేక్‌తో స్టార్ నటుడుగా మారుతాడు అనుకున్న సమయంలో వరుస ఫ్లాప్‌లు అతడిని కిందకి దించేశాయి. ప్రస్తుతం ఆడపదడపా సినిమాలు చేస్తూ వస్తున్నాడు. గతేడాది నింద సినిమాతో వచ్చి మంచి మార్కులు సంపాదించాడు. ఇదిలావుంటే ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం కానిస్టేబుల్. ఈ సినిమాకు ఆర్యన్ సుభాన్ SK దర్శకత్వం వహిస్తుండగా.. జాగృతి మూవీ మేకర్స్ పతాకంపై బలగం జగదీష్ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఇప్పటికే మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే తాజాగా ఈ సినిమా నుంచి కానిస్టేబుల్ ప్రమోషనల్ సాంగ్‌ను హైదరాబాద్ కమిషనర్ సీవి ఆనంద్ చేతుల మీదుగా చిత్రబృందం లాంఛ్ చేయించింది. కానిస్టేబుల్ అన్నా అనే టైటిల్‌తో వచ్చిన ఈ పాట కానిస్టేబుళ్ల కృషి, అంకితభావం, త్యాగాలకు గుర్తుకుతెస్తుందని చిత్రబృందం వెల్లడించింది. ఈ సాంగ్ విన్న హైదరాబాద్ కమిషనర్ సినిమా విజయం సాధించాలని చిత్రబృందానికి విషెస్ తెలిపాడు. సుభాష్ ఆనంద్ సంగీతం అందించిన ఈ పాటను నల్గొండ గద్దర్ నర్సన్న పాడారు.





## అఖండ-2లో నాయికగా..

'భీమ్లానాయక్'తో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన మలయాళ సోయగం సంయుక్తమీనన్ ఆ తర్వాత వరుస సినిమాలతో తెలుగులో బిజీగా మారింది. ప్రస్తుతం ఈ భామ టాలీవుడ్‌లో మూడు చిత్రాల్లో నటిస్తున్నది. తాజాగా ఆమె మరో భారీ ఆఫర్‌ను దక్కించుకుంది. బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో 'అఖండ-2: తాండవం' చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. బ్లాక్‌బస్టర్ హిట్ 'అఖండ'కు సీక్వెల్ ఇది. 14రీల్స్ పతాకంపై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. ఈ సినిమాలో సంయుక్తమీనన్ కథానాయికగా ఖరారైంది. కథాగమనంలో ఆమె పాత్ర కీలకంగా ఉంటుందని దర్శకుడు బోయపాటి శ్రీను తెలిపారు. సెప్టెంబర్ 25న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రానికి తమన్ సంగీతాన్నందిస్తున్నారు.



## వేసవిలో రానున్న జాట్


బాలీవుడ్ అగ్ర హీరో సన్నీ డియోల్ నటిస్తున్న తాజా చిత్రం 'జాట్'. గోపీచంద్ మలినేని దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఏప్రిల్ 10న హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా శుక్రవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో సన్నీ డియోల్ భుజంపై భారీ తుపాకీని మోస్తూ యాక్షన్ ప్యాక్డ్ అవతారంలో కనిపిస్తున్నారు. 'పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామా ఇది. పోరాట ఘట్టాలు హైలైట్‌గా నిలుస్తాయి. 'పుష్ప 2' చిత్రంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శించిన ఈ చిత్ర టీజర్‌కు మంచి స్పందన లభించింది' అని మేకర్స్ తెలిపారు. రణదీప్ హూడా, వినీత్‌కుమార్ సింగ్, సయామీఖేర్, రెజీనా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, టీజీ విశ్వప్రసాద్, రచనదర్శకత్వం: గోపీచంద్ మలినేని.

## బెనిఫిట్ షోలు రద్దు..

### మరోసారి క్లారిటీ ఇచ్చిన తెలంగాణ హైకోర్టు

తెలంగాణలో సినిమా బెనిఫిట్ షోలకు సంబంధించి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేసింది తెలంగాణ హైకోర్టు. భవిష్యత్‌లో బెనిఫిట్ షోలకు అనుమతి లేదంటూ వెల్లడించింది. సినిమా టికెట్ ధరల పెంపు, స్పెషల్ షోలకు సంబంధించిన పిటిషన్‌కి సంబంధించి శుక్రవారం హైకోర్టులో విచారణ జరుగగా.. ప్రభుత్వం తరపున న్యాయవాది తన వాదనాలు వినిపిస్తూ.. సంక్రాంతి సమయంలో సినిమా టికెట్ ధరలను పెంచుకోవడానికి ఇచ్చిన అనుమతులను ప్రభుత్వం రద్దు చేసినట్లు న్యాయస్థానానికి వివరించారు. ఇక ప్రభుత్వం తరపు వాదానలు విన్న ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. బెనిఫిట్ షోలకి అనుమతి లేదంటూ తెలిపింది. సినిమాటోగ్రఫీ యాక్ట్ ప్రకారం.. అర్థరాత్రి 1.30 గంటల నుంచి ఉదయం 8.40 వరకు గల మధ్య సమయంలో ఎలాంటి ప్రత్యేక షోలకు అనుమతి లేదని.. ఈ చట్టాన్ని పాటించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ కేసుపై తదుపరి విచారణను ఫిబ్రవరి 21కి వాయిదా వేసింది. అయితే హైకోర్టు ఇచ్చిన కొత్త ఆదేశాల ప్రకారం.. తెలంగాణలో ఇకముందు బెనిఫిట్ షోలు, టికెట్ రేట్లు రద్దయినట్లు తెలుస్తుంది.





## కుంభమేళాలో సన్యాసం తీసుకున్న నటి

ఉత్తరప్రదేశ్ అలహాబాద్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో మాజీ నటి మమతా కులకర్ణిసన్యాసం తీసుకుంది. జనవరి 24న మహాకుంభమేళాకు వెళ్లిన ఆమె మహామండలేశ్వర్‌గా మారుతున్నట్లు ప్రకటించింది. తన జీవితం దేవుడికి అంకింతం ఇస్తూ.. ఇక నుంచి ఆధ్యాత్మిక బాటలో ప్రయాణించాలి అనుకుంటున్నా అంటూ చెప్పుకోచ్చింది. ఈ సందర్భంగా తన పేరును శ్రీ యామై మమత నందగిరిగా మార్చుకుంది. బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లో ఒకప్పుడు అగ్రతారగా వెలుగు వెలిగింది మమత కులకర్ణి. తాను నటించిన కరణ్ అర్జున్, క్రాంతివీర్, సబ్‌సే బడా ఖిలాడి, కిస్మత్, నజీబ్ సూపర్ హిట్ కావడంతో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. తెలుగులో కూడా ప్రేమ శిఖరంతో పాటు మోహన్ బాబు హీరోగా వచ్చిన దొంగా పోలీస్ చిత్రంలో నటించింది ఈ భామ. అయితే సడన్‌గా తాను నటనకు గుడ్ బై చెబుతున్నట్లు ప్రకటించి అందరిని షాక్‌కి గురిచేసింది. ఇక 20 ఏండ్ల క్రితం నటనను వదిలేసి విదేశాల్లో వెళ్లి స్థిరపడింది మమత.. తాజాగా మహకుంభమేళలో కనపడడం.. సన్యాసం తీసుకోవడం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి.



# క్రీడా వార్తలు | SPORTS NEWS



## 2024 బెస్ట్ టీ20 టీమ్‌ని ప్రకటించిన ఐసీసీ..

# కెప్టెన్‌గా రోహిత్ శర్మ..!

అంతర్జాతీయ క్రికెట్ నియంత్రణ మండలి (ICC) 2024 సంవత్సరానికి టీ20 బెస్ట్ టీమ్‌ను శనివారం ప్రకటించింది. అత్యుత్తమ జట్టులో నలుగురు భారతీయ ఆటగాళ్లకు చోటు దక్కింది. గతేడాది టీ20 ప్రపంచకప్ గెలిచిన ప్లేయర్స్‌లో నుంచి ఇద్దరు ఈ జాబితాలో ఉన్నారు. జట్టు కెప్టెన్‌గా రోహిత్ శర్మను ఎంపిక చేసింది. టీ20 ప్రపంచకప్2024 తర్వాత టీ20 ఇంటర్నేషనల్ నుంచి రోహిత్, విరాట్ రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక వుమెన్స్ జట్టులో ముగ్గురు భారత ప్లేయర్‌కు చోటు దక్కింది. స్మృతి మంధాన, రిచా ఘోష్, దీప్తి శర్మ బెస్ట్ టీమ్‌లో ఐసీసీ చోటు కల్పించింది. అత్యధికంగా భారత జట్టు నుంచి ముగ్గురు, దక్షిణాఫ్రికా నుంచి ఇద్దరికి చోటు దక్కగా.. జట్టు కెప్టెన్సీగా సౌతాఫ్రికా ప్లేయర్ ఎల్ వోల్వార్డ్‌ను ఎంపిక చేసింది.

**బెస్ట్ టీమ్‌లో ఉన్నది ఎవరు..?**

భారత్ నుంచి నలుగురు, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, పాకిస్తాన్, వెస్టిండీస్, ఆఫ్ఘనిస్తాన్, శ్రీలంక, జింబాబ్వే నుంచి ఒక్కొక్కరు ఎంపికయ్యారు. భారత్ నుంచి రోహిత్‌తో పాటు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, పేసర్ జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్ ఉన్నారు. జట్టులో ఆస్ట్రేలియాకు చెందిన ట్రావిస్ హెడ్, ఇంగ్లండ్‌కు చెందిన ఫిల్ సాల్ట్, వెస్టిండీస్‌కు చెందిన నికోలస్ పూరన్ (వికెట్ కీపర్), ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన రషీద్ ఖాన్, శ్రీలంకకు చెందిన వనిందు హసరంగా, జింబాబ్వేకు ప్లేయర్ సికందర్ చోటు దక్కించుకున్నారు. గతేడాది ప్రపంచకప్‌లో తొలిరౌండ్‌లోనే ఇంటిముఖం పట్టిన పాకిస్థాన్ జట్టు కెప్టెన్ బాబర్ అజామ్ సైతం టీ20 బెస్ట్ ప్లేయింగ్ 11లో చోటు దక్కించుకోవడం విశేషం.

**రోహిత్ టీ20లో రాణించిన రోహిత్..**

రోహిత్ శర్మ 2024లో 11 మ్యాచ్‌లలో 42 సగటుతో మరియు 160.16 స్ట్రయిక్ రేట్‌తో 378 పరుగులు చేశాడు. ఇందులో 121 పరుగులు బెస్ట్ స్కోర్. ఒకే ఒక్క సెంచరీ సాధించాడు. అదే సమయంలో ఆల్ రౌండర్ హార్దిక్ గతేడాది 17 మ్యాచుల్లో 352 పరుగులు చేసి 16 వికెట్లు పడగొట్టాడు. 50 పరుగులు అత్యుత్తమ స్కోర్ కాగా.. 20 పరుగులకు మూడు వికెట్లు పడగొట్టాడు.

భారత్ టీ20 ప్రపంచకప్ విజయంలో కీలక పాత్ర పోషించిన బుమ్రా గతేడాది ఎనిమిది టీ20 మ్యాచ్‌లు ఆడి 15 వికెట్లు పడగొట్టాడు. ఏడు పరుగులకు మూడు వికెట్లు తీశాడు. అర్షదీప్ సైతం బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. 18 మ్యాచ్‌లు ఆడి 13.50 సగటుతో 36 వికెట్లు తీశాడు. అతని అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన తొమ్మిది పరుగులకు నాలుగు వికెట్లు.

**ఐసీసీ మెన్స్ టీమ్ ఆఫ్ ది ఇయర్ 2024**

రోహిత్ శర్మ (కెప్టెన్‌భారత్), ట్రావిస్ హెడ్ (ఆస్ట్రేలియా), ఫిల్ సాల్ట్ (ఇంగ్లండ్), బాబర్ అజామ్ (పాకిస్థాన్), నికోలస్ పూరన్ (వికెట్ కీపర్), సికందర్ రజా (జింబాబ్వే), హార్దిక్ పాండ్యా (భారత్), రషీద్ ఖాన్ (ఆఫ్ఘనిస్థాన్), వనిందు హసరంగా (శ్రీలంక), జస్ప్రీత్ బుమ్రా (భారత్), అర్షదీప్ సింగ్ (భారత్).

### ఐసీసీ ఉమెన్స్ T20 టీమ్ ఆఫ్ ది ఇయర్ 2024

ఎల్ వోల్వార్డ్ (కెప్టెన్-దక్షిణాఫ్రికా), మారిజాన్ కాప్ (దక్షిణాఫ్రికా), స్మృతి మంధాన (భారత్), రిచా ఘోష్ (వికెట్ కీపర్-భారతదేశం), దీప్తి శర్మ (భారత్), చమరి అటపట్టు (శ్రీలంక), హేలీ మాథ్యూస్ (వెస్టిండీస్), నాట్ సెవార్డ్ బ్రంట్ (ఇంగ్లాండ్), మెల్లీ కర్ (ఆస్ట్రేలియా), ఓర్లా ప్రెండర్‌గాస్ట్ (ఐర్లాండ్), సాడియా ఇక్బాల్ (పాకిస్థాన్).




## రంజీలో ముంబైకి షాక్.. జమ్మూకశ్మీర్ స్టన్నింగ్ విక్టరీ

**ముంబై:** డిఫెండింగ్ చాంపియన్ ముంబై జట్టు.. రంజీ టోర్నీగ్రూపు ఏ మ్యాచ్‌లో .. జమ్మూకశ్మీర్ చేతిలో ఓటమి పాలైంది. 5 వికెట్ల తేడాతో జమ్మూకశ్మీర్ జట్టు విజయం నమోదు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో 205 రన్స్ టార్గెట్ తో బరిలోకి దిగిన జమ్మూకశ్మీర్ ఓ దశలో 159 రన్స్‌కే అయిదు వికెట్లు కోల్పోయింది. కానీ ఆరో వికెట్‌కు అబిద్ ముస్తాక్, కన్హయ్య వద్వాన్ అజేయంగా 46 రన్స్ జోడించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ముంబై బౌలర్ షామ్స్ ములానీ నాలుగు వికెట్లు తీసుకున్నాడు. వాస్తవానికి ఈ రంజీ మ్యాచ్ కోసం రోహిత్ శర్మ తిరిగి జట్టులోకి వచ్చాడు. ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్‌లో పేలవ ఫామ్ ప్రదర్శించిన రోహిత్.. దేశవాళీ క్రికెట్‌లో ఆడాల్సి వచ్చింది. అయితే జమ్మూకశ్మీర్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను విఫలం అయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో మూడు, రెండో ఇన్నింగ్స్‌లో 28 రన్స్ మాత్రమే చేశాడు. యుధీర్ సింగ్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. అతను ఈ మ్యాచ్‌లో ఏడు వికెట్లు తీసుకున్నాడు. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో కీలకమైన 20 రన్స్ చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లో ముంబై బ్యాటర్ శార్దూల్ ఠాకూర్ 119 రన్స్ చేసి ఔటయ్యాడు. రంజీ ట్రోఫీ గ్రూపు సీ మ్యాచ్‌లో.. కర్నాటక చేతిలో పంజాబ్ ఓడిపోయింది. ఇన్నింగ్స్ 207 తేడాతో ఓటమి చవిచూసింది. పంజాబీ బ్యాటర్ శుభమన్ గిల్ సెంచరీ చేసినా తమ జట్టును గెలిపించలేకపోయాడు. పంజాబ్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 55, రెండో ఇన్నింగ్స్‌లో 213 రన్స్ చేసింది. కర్నాటక తన ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 475 రన్స్ చేసింది. రవిచంద్రన్ స్మరన్ 203 రన్స్ చేశాడు.




## చాంపియన్స్ ట్రోఫీలో శ్రేయాస్ అయ్యర్‌ను తేలిగ్గా అవుట్ చేయొచ్చు..: బాసిత్ అలీ




శ్రేయాస్ అయ్యర్ ప్రస్తుతం రంజీ ట్రోఫీలో ముంబయి తరపున బరిలోకి దిగాడు. శరద్ పవార్ క్రికెట్ అకాడమీ బీకేసీలో జమ్మూకశ్మీర్‌తో జరిగిన మ్యాచ్‌లో విఫలమయ్యాడు. ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 11 పరుగులు.. సెకండ్ ఇన్నింగ్‌లో 17 పరుగులు మాత్రమే చేయగలిగాడు. అయితే, అయ్యర్ వైఫల్యంపై మాజీ క్రికెటర్ బాలిస్ అలీ స్పందించాడు. అయ్యర్ అవుట్ చేయడం చాలా ఈజీ అని స్టేట్‌మెంట్ ఇచ్చాడు. అయ్యర్‌ను త్వరగా ఎలా అవుట్ చేయాలో పాక్ టీమ్‌కు సలహా ఇచ్చాడు. ఛాంపియన్స్ ట్రోఫీ ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. భారత జట్టు మ్యాచులన్నీ దుబాయి వేదికగా జరుగనున్నాయి. మిగతా మ్యాచులన్నీ పాక్‌లో నిర్వహిస్తారు. ఫిబ్రవరి 23న భారత్‌పాకిస్థాన్ తలపడనున్నాయి. జమ్మూ కశ్మీర్‌తో మ్యాచ్ సందర్భంగా ముంబయి తొలి ఇన్నింగ్స్‌లో శ్రేయాస్ షాట్ సెలక్షన్‌పై బాసిత్ అలీ విమర్శించాడు. మ్యాచ్‌లో వైడ్ మిడ్ ఆన్‌లో క్యాచ్ అవుటయ్యాడు. ఫాస్ట్ బౌలర్ యుధ్వీర్ వేసిన ఫుల్లర్ డెలివరీని ఫీల్డర్ మీదుగా షాట్ ఆడేందుకు ప్రయత్నించాడు. దారుణమైన విషయం ఏంటంటే.. ముంబయి ఇప్పటికే ఆరు వికెట్లు కోల్పోయిన సమయంలో భారీ షాట్‌కు ప్రయత్నించడం గమనార్హం. ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో అయ్యర్‌ను అవుట్ చేయడానికి ఇదే తేలికైన మార్గమని బాసిత్ పేర్కొన్నారు. యూట్యూబ్ ఛానల్‌తో మాట్లాడుతూ.. ఆ ఇన్నింగ్స్‌లో శ్రేయాస్ అయ్యర్ చెత్త షాట్ ఆడాడని పేర్కొన్నారు. జట్టు కీలకమైన ఆరు వికెట్లు కోల్పోయిందని పేర్కొన్నారు. ఛాంపియన్స్ ట్రోఫీలో శ్రేయాస్ అయ్యర్‌ను తరహాలో అవుట్ చేయవచ్చని పేర్కొన్నారు. హిట్టింగ్‌కు వెళ్లే సమయంలో మిడ్ ఆన్ బ్యాక్‌లో దొరకబుచ్చుకోవచ్చని పేర్కొన్నాడు.

## తమిళనాడు మహిళా కబడ్డీ ప్లేయర్లపై దాడి..



**బటిండా:** పంజాబ్‌లోని బటిండాలో జరుగుతున్న ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో .. మహిళా కబడ్డీ ప్లేయర్లుఘర్షణ పడ్డారు. తమిళనాడుకు చెందిన ప్లేయర్లపై అటాక్ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. మ్యాచ్ రిఫరీ ఇచ్చిన నిర్ణయం పట్ల అసంతృప్తితో ఉన్న ఆటగాళ్లు గొడవపడినట్లు తెలుస్తోంది. బటిండాలో నార్త్ జోన్ ఇంటర్ యూనివర్సిటీతో పాటు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ మహిళల చాంపియన్‌షిప్ పోటీలు జరుగుతున్నాయి. దాంట్లో మదర్ థెరిసా యూనివర్సిటీ, పెరియార్ యూనివర్సిటీ, అలగప్ప యూనివర్సిటీ, భారతీయార్ వర్సిటీలు పాల్గొంటున్నాయి. ప్రత్యర్థి ఆటగాళ్ల మధ్య గొడవ ప్రారంభమైనట్లు తొలుత నివేదిక వచ్చింది. మదర్ థెరిసా యూనివర్సిటీ, దర్భంగా యూనివర్సిటీ మధ్య మ్యాచ్‌లో ఘర్షణ జరిగింది. కబడ్డీ మ్యాచ్ రిఫరీ ఒకరు.. మదర్ థెరిసా జట్టు ప్లేయర్‌పై అటాక్ చేశారు. ఫౌల్ అటాక్‌కు సంబంధించి వాగ్వాదం జరిగిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నది. సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్ అవుతున్నది. కొందరు పురుషులతో మహిళలు గొడవకు దిగుతున్నట్లు ఆ వీడియోలో ఉంది. అయితే వాళ్లు అధికారులు లేక ప్రేక్షకులా అన్న విషయంపై క్లారిటీ లేదు. ఇరు జట్ల ఆటగాళ్లు ఒకరిపై ఒకరు చైర్స్ విసురుకున్నారు. తమిళనాడు మహిళా కబడ్డీ ప్లేయర్లు క్షేమంగా ఉన్నారని, వాళ్లు త్వరలో రాష్ట్రానికి రానున్నట్లు మంత్రి ఉదయనిధి స్టాలిన్ తెలిపారు. ఎవరికీ ఏమీకాలేదని, వాళ్లు ఢిల్లీలోని తమిళనాడు హౌజ్‌కు చేరుకున్నారని, త్వరలో తమిళనాడు రానున్నట్లు చెప్పారు.


EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com



## ఐదు లక్షల రూపాయల ఎల్ఓసిని అందించిన ఎమ్మెల్యే

### కృతజ్ఞతలు తెలిపిన రోగి కుటుంబ సభ్యులు

**ఇబ్రహీంపట్నం, జనవరి 25 మహా:** రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఏర్పుల రమేష్‌కు ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే. మంచాల మండల గ్రామం నిరుపేద కుటుంబానికి చెందిన ఏర్పుల రమేష్ కి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అత్యవసర ఆపరేషన్ నిమిత్తం రూ 5లక్షల ఎల్ఓసిని, రోగి కుటుంబ సభ్యులకు, స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అందజేశారు. అత్యవసర సమయంలో ఐదు లక్షల రూపాయల ఎల్ఓసిని అందజేసి మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన రమేష్ కుటుంబ సభ్యులు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జమాల్ పూర్ శ్యామ్ లాల్ రమేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో మంత్రి ఆకస్మిక తనిఖీ

### వంటశాలను క్షుణ్ణంగా పరిశీలించిన మంత్రి.. పాల్గొన్న నగర మేయర్ జిల్లా కలెక్టర్

**వరంగల్, మహా;** జిల్లాలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖ, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడి పరిసరాలను, వంటశాలను ధాన్యం నిలువలు ఉన్న పప్పు దినుసులు కూరగాయలు నిల్వ చేసే క్రమాన్ని పరిశీలించి వాటిని వాడుతున్న తీరును పరిశీలించడమైనది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పప్పు దినుసుల్లో నమూనా శాంపిల్ తీసి పరిశీలించారు. అందులో నుండి చింతపండు పప్పు దినుసులు రవ్వ మరియు బియ్యం శాంపిల్స్ తీసుకుని క్వాలిటీ వెరిఫికేషన్ చేయవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించడమైనది. ముందుగా మంత్రిని పిల్లలు ఆప్యాయంగా స్వాగతం పలికి పుష్ప గుచ్చం అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమీక్ష లో మంత్రి మాట్లాడుతూ అబ్బాయిల కంటే అమ్మాయిలే చదువులో ముందున్నారని గతంలో ఆడపిల్లలను ఎక్కువ చదివించినట్లయితే వాళ్లకు తగిన పెళ్లి సంబంధాలు వెతకడంలో ఇబ్బందులు పడవలసి వస్తుందని ఉన్నత చదువులకు ప్రోత్సహించేవారు కాదని, ప్రస్తుత పరిస్థితులలో అమ్మాయిలు వాళ్ల కాళ్ళ మీద వాళ్ళు నిలబడే స్తోమత కలిగి ఉండాలంటే ఉన్నత చదువులు చదివించాలని ప్రతి ఒక్క తల్లిదండ్రులకి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఆ కాలంలో నేను డిగ్రీనే చేశానని ప్రస్తుతం ఓపెన్ యూనివర్సిటీలో ఎంబీఏ చేస్తున్నానని మంత్రి అన్నారు.



చదువుల్లో పోటీ ఉంటేనే ముందుకు సాగుతారని ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మంత్రిగారు బాలికలను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం ప్రైవేట్ భవనంలో కొనసాగుతున్న సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను సొంత భవనాల్లో నిర్మాణం చేపట్టుటకు స్థలాన్ని పరిశీలించి నివేదికలు సమర్పించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించడమైనది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు ఉన్నత చదువులు చదివి సొంతంగా ఒక మంచి స్థానం సంపాదించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. వాళ్ళ వాళ్ళ ఆలోచన విధానాన్ని బట్టి మీరు ఏమవుతారు అని ముందే నిర్ణయించుకుని ఆ దిశగా మీరు సాగించినట్టయితే మీ లక్ష్యం నెరవేరుతుందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాలికలను ఉద్దేశించి మాట్లాడారు. పిల్లలతో ఇంట్రాక్ట్ అయి వారు భోజన ఎలా పెడుతున్నారు అనేది వాళ్ల మాటల్లో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ సత్య పాల్ రెడ్డి, ఎమ్మార్వో నాగేశ్వరరావు, ఆర్ ఐ ఆర్ ఐ కీర్తన్, ఆర్ సి ఓ అపర్ణ, ప్రిన్సిపల్ వి రాధిక కళాశాల యజమాన్యం సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# యువత క్రీడా స్ఫూర్తితో రాణించాలి

### ఎంపీఆర్ క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన పరమేశ్వర్ రెడ్డి



**రామంతాపూర్, జనవరి 25, మహా:** రామంతాపూర్ డివిజన్ అధ్యక్షులు రఫిక్ ఆధ్వర్యంలో ఎంపీఆర్ క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించారు. రామంతాపూర్ చిన్న చెరువు ఏరియాలో శనివారం నిర్వహించిన టోర్నమెంట్ ను పరమేశ్వర్ రెడ్డి ప్రారంభించి ఈ సందర్భంగా యువత క్రీడా స్ఫూర్తితో జీవితంలో అన్ని రంగాల్లోనూ రాణించాలని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఏ క్రీడా పోటీలలో నైనా గెలుపు ఓటములు ఉంటాయన్నారు. ఎంత క్రీడాకారులు పోటీ పడినా విజయం సాధించేది ఒకరేనన్నారు. ఈ స్ఫూర్తితోనే క్రీడా పోటీల్లో పాల్గొంటూనే ఉంటారన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి తౌఫిక్, మాజీ కార్పొరేటర్ సింగి రెడ్డి ధనపాల్ రెడ్డి, సుర్వి మురళి గౌడ్ జిమ్ సందీప్, ఆకారపు అరుణ్, నామ్ రాజి రెడ్డి, వల్లపు శ్రీకాంత్ యాదవ్, బుక్కా సురేష్, గరిక సుధాకర్, జలీల్ పశ, లుకాస్, పుస సత్తి, ఉదయ్ భాస్కర్ గంగాపుత్ర, సత్తన్న, సందీప్, భాస్కర్, ఆదినారాయణ గౌడ, షకీల్ నజీర్ బాబా, బుల్లెట్ అశోక్, సంధ్యా రాణి, గాయత్రి, సతీష్, శగా శ్రీధర్, నాని, సూరి, మధు, సాయి, అరుణ్ సాయి, నాగమల్లయ్య, పెంటయ్య, జంగా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

### కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రాధిక



**ఇబ్రహీంపట్నం, జనవరి 25 మహా:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నం సామాజిక శాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. రాధిక మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి విద్యార్థి ఓటరుగా నమోదు చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రజాస్వామ్యం యొక్క విజయం, దేశం యొక్క అభివృద్ధి మరియు భవిష్యత్తు ఓటు హక్కు వినియోగంపైనే ఆధారపడి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్యము మరియు ఓటరు భాగస్వామ్యం అనే అంశంపై వివిధ అధ్యాపకులు ప్రసంగించారు. అనంతరం విద్యార్థులచే ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగాధిపతి జి. రవికుమార్ ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్, అకాడమిక్ కోఆర్డినేటర్ ఎస్ నరేందర్ రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ నీలిమ, డాక్టర్ సి.వి. పవన్ కుమార్. డాక్టర్ డి.వి. రావు డాక్టర్ టి. కృష్ణ, డాక్టర్ ఎస్. ఎస్. ఆర్. కృష్ణ ఫిజికల్ డైరెక్టర్ నరసింహారావు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఎఫ్టీఎల్ పరిధిలో అక్రమార్కుల ఆగడాలు!

### చదను పేరుతో పొలాన్ని మట్టితో నింపేస్తున్నారు

**ఇబ్రహీంపట్నం, జనవరి 25 మహా:** ఎఫ్టిఎల్ పరిధిలోని భూమిని చదును చేస్తున్నామని మట్టితో నింపేస్తున్న అక్రమార్కులు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి కుంట చెరువులో కొందరు రియల్ ఎస్టేట్ వ్యక్తులు ఎఫ్టిఎల్ పరిధిలోకి వచ్చే పొలాన్ని పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు. చదును చేస్తున్న మన్న పేరుతో మట్టితో నింపేస్తున్నారని అధికారులు తెలిపారు. ఎఫ్టిఎల్ పరిధిలోని పొలాలలో మట్టితో నింపడం, కట్టలు కట్టడం చట్టరీత్యా నేరమని అన్నారు. ఎఫ్టిఎల్ పరిధిలోని భూమి, హైడ్రా పరిధిలోకి వస్తుందని, ఇలాంటి అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని ఇరిగేషన్ అధికారులు హెచ్చరించారు.

# జిల్లాలో టాస్క్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం గొప్ప వరం

### కష్టంలో వచ్చిన విజయం జీవితాంతం సంతోషం నింపుతుంది

**ప్రజలకు అవసరం కానున్న విద్యను అభ్యసించాలి**

**మానవుడు సంఘజీవి...మంత్రి సీతక్క**

**ములుగు, మహా :** జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు పొందేందుకు ప్రతిభ పరిజ్ఞానం అభివృద్ధి చేసుకోవడానికి జిల్లాలో టాస్క్ సెంటర్ ఏర్పాటు చేయడం గొప్ప వరంగా ఉందని, కష్టంలో వచ్చిన విజయం జీవితాంతం సంతోషాన్నిస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో జిల్లాలోని నిరుద్యోగ యువతి యువకులకు ప్రతిభ, పరిజ్ఞానం పెంపొందించుకోవడం కోసం ఏర్పాటు చేసిన టాస్క్ సెంటర్ ను కలెక్టర్ దివాకర్ టి.ఎస్., గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ లతో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ టాస్క్ సెంటర్ ఏర్పాటు చేయడం వలన మారుమూల ప్రాంతాలలోని యువతి, యువకులకు ఎంతగానో దోహదపడుతుందని, ప్రతిభా పరిజ్ఞానం లేకపోతే ఉన్నత చదువులు చదివిన లాభం ఉండదని అన్నారు. శిక్షణ పొందే క్రమంలో కొంత కష్టంగా ఉన్నప్పటికీ శిక్షణ పొందిన వారు ఉద్యోగ అవకాశాలు పొందుతారని, కష్టపడి చదివిన వారేకే విజయం దరి చేరుతుందని అన్నారు. నేటి కాలంలో కంప్యూటర్ పరిజ్ఞానం అనేది మామూలుగా మారిపోయిందని, ఐటీ రంగం పోయి ఆర్టిఫిషియల్ ఇంటిలెన్స్ యుగం వచ్చిందని అన్నారు. ప్రతి ఒక్కరికి కమ్యూనికేషన్ స్కిల్ కచ్చితంగా ఉండాలని, ఎలాంటి అవకాశాలు వచ్చిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మానవుడు సంఘజీవి అని కొందరు ఒంటరిగా ఉండడానికి ఇష్టపడతారని అన్నారు. దేశంలో ఇతర దేశాలలో ఇక్కడ పని చేసిన పరిజ్ఞానం అనేది ముఖ్యమని, మారుతున్న పరిస్థితులను తట్టుకునే విధంగా ఎదగాలని అన్నారు. యువతి యువకులు తల్లిదండ్రులకు భారం కాకుండా ఒక లక్ష్యంతో ముందుకు సాగాలని, శిక్షణలో పొందిన ప్రతిభ, పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. విద్యార్థులు ప్రస్తుత సమయంలో ప్రజలకు అవసరము కానున్న విద్యను అభ్యసించాలని, ప్రతిభ పరిజ్ఞానంతో ఏదైనా సాధించవచ్చు అని ఆమె అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తాను చిన్నప్పటి నుండి కష్టపడి చదివిన పరిస్థితులను యువతకు వివరించారు. ఒక కుటుంబం బాగుపడాలంటే ఒకరికి ఉద్యోగం ఉండాలని, ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగమైన వచ్చిన అవకాశాన్ని వదల వద్దని సూచించారు. ఇటీవల జిల్లాలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 1200 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ సిన్హా, సీఈఓ టాస్క్, సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, సి ఓ ఓ టాస్క్, ఇ.సవీన్‌రెడ్డి, రీజనల్ సెంటర్ హెడ్ ఎం.సుధీర్, క్లస్టర్ మేనేజర్,ఎం. రామ కృష్ణ, రిలేషన్ షిప్ మేనేజర్, కె.మురళీకృష్ణ, సెంటర్ మేనేజర్, సంబంధిత అధికారులు, యువత, తదితరులు పాల్గొన్నారు.



## వరంగల్‌లో ఘనంగా జాతీయ ఓటర్లు దినోత్సవం

- ఓటు అనేది వజ్రాయుధం.. జిల్లా జడ్జి నిర్మల గీతాంబ
- 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్, మహా:** 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జాతీయ ఓటర్లు దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐ.ఎం.ఏ) హాల్ లో నిర్వహించిన సమావేశానికి జిల్లా జడ్జి గౌరవ బి.వి నిర్మలగీతాంబ,జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా,మున్సిపల్ కమిషనర్ అశ్విని తనాజీ వాకడే, అదనపు కలెక్టర్ జి సంధ్యా రాణి పాల్గొని ప్రతిజ్ఞ తోపాటు ఫ్లాష్ మబ్ అనంతరం ర్యాలీ నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో భారత ఎన్నికల ప్రధాన కమిషన్ రాజీవ్ కుమార్ సందేశాన్ని పిపిటి ద్వారా ప్రజలకు వినిపించారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేయించడమైనది. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ కి శాలువాలు పూలమాలలతో సన్మానించడం జరిగింది. జూనియర్ ఓటర్స్ కి ఓటర్ కార్డును అందించడమైనది. ఈ సందర్భంగా జిల్లా జడ్జ్ బీ.వీ.నిర్మల గీతాంబ గారు జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మాట్లాడుతూ ఓటు హక్కు అనేది ఫండమెంటల్ రైట్ అని, ప్రజాస్వామిక దేశంలో మనం స్వేచ్ఛ సమానత్వం మనం అనుభవిస్తున్న తీరుని చూసినట్లయితే బయటి దేశాలతో పోలిస్తే మనం ఎంతో ప్రశాంతంగా ఉన్నట్లు తెలుస్తుందని వారు అన్నారు.

## ఘనంగా 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం

### విద్యార్థులకు కలెక్టర్ ఓటర్ కార్డు అందజేత




**ఇబ్రహీంపట్నం, జనవరి 25 మహా:** రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని డిగ్రీ కళాశాల విద్యార్థులు హాజరయ్యారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు జాతీయ సేవా పథక ప్రోగ్రాం అధికారి మరియు తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చింతల రాకేశ్ భవాని ఆధ్వర్యంలో కళాశాల నుండి బయలుదేరి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవం వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక పురస్కారం పొందిన సందర్భంగా డాక్టర్ రాకేశ్ భవానిని కలెక్టర్ నారాయణరెడ్డి మెమెంటోతో అభినందించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ చింతల రాకేశ్ భవాని, కలెక్టర్ కు తాము చేస్తున్న ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు కలెక్టర్ నారాయణరెడ్డి చేత ఓటర్ ఐడి కార్డులు అందజేశారు.



## పీర్జాదిగూడలో జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు

**మేడిపల్లి, జనవరి 25, మహా:** పీర్జాదిగూడ నగరపాలక సంస్థ కార్యాలయంలో "జాతీయ ఓటర్ల దినోత్సవం" వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ అమర్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై మున్సిపల్ కమిషనర్, అధికారులతో కలిసి ప్రార్థన ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ అమర్ సింగ్ జాతీయ ఓటర్ల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సిన అవసరాన్ని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, కమీషనర్, డిఈ, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది అలాగే స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కిడ్నీ మాఫియా కేసులో 10 మంది అరెస్ట్

### ఇంకా పరారీలోనే ప్రధాన నిందితులు.. ఈ కేసులో ప్రదాన సూత్రధారి పవన్, అవినాష్

**ఎల్బీనగర్, జనవరి 25,మహా:** రాష్ట్ర వ్యాప్తంగా సంచలం సృష్టించిన కిడ్నీ మార్పిడి కేసులో పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు.ఈ కేసులో ప్రధాన సూత్రధారులు పరారీలో ఉండగా 15మందితో 10మందిని పోలీసులి ఇప్పటికే అరెస్ట్ చేశారు.ప్రధాన సూత్రదారులు అవినాష్ అని తెలిపారు అలకనంద ఆసుపత్రి ఓనర్ సుమంత్ అరెస్ట్ అయినట్లు తెలిపారు. అయితే గత కొంత కాలంగా నడుస్తున్న అక్రమ కిడ్నీమార్పిడి దందాను శనివారం రాచకొండ పోలీసులు వెలుగులోకి తెచ్చారు. ఈ అక్రమ కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ వ్యాపారాన్ని నడిపిస్తున్న ముఠాలో మొత్తం 9 మందిని అరెస్టు చేయగా మరో ఆరుగురు పరారీలో ఉన్నారు. ఇప్పటి వరకు కేవలం అలకనంద ఆసుపత్రిలోనే 20 కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ చికిత్సలు జరిగాయని పోలీసుల దర్యాప్తులో వెలుగు చూసింది. ఎల్బీనగర్ రాచకొండ పోలీస్ కమిషనర్ క్యాంపు కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు వెల్లడించిన వివరాల ప్రకారం...హైదరాబాద్ కు చెందిన డాక్టర్ అవినాష్ చైనాలో ఎంబీబీఎస్ పూర్తి చేసి పూణేలో డిప్లొమా ఇన్ సర్జరీ కోర్సును పూర్తి చేశాడు. ఆ తర్వాత హైదరాబాద్ మాదన్నపేట లో కొంతమంది పార్టనర్ లతో కలిసి అవినాష్ జనని, అరుణ హాస్పటల్ ను తీసుకుని నడిపించాడు. ఆర్థిక నష్టాలు, సమస్యలు రావడం తో హాస్పిటల్ ను అమ్మేందుకు నిర్ణయించుకున్నాడు. ఈ సమయంలో అవినాష్ కు వైజాగ్ కు చెందిన లక్ష్మణ్ పరిచయమయ్యాడు.అతను అవినాష్ కు అక్రమ కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ దందా గురించి ప్రతిపాదన ఇచ్చాడు. మీరు కేవలం కిడ్నీ మార్పిడికి కోసం ఆపరేషన్ థియేటర్ ను ఇస్తే ఒక మార్పిడికి రూ. 2.50 లక్షలు ఇస్తానని ఒప్పించాడు. దీనికి అవినాష్ ఒకే అనడంతో 2023 ఏప్రిల్ నుంచి 2024 జూన్ వరకు జనని హాస్పిటల్ లోని ఆపరేషన్ థియేటర్ ను అక్రమ కిడ్నీ మార్పిడి కోసం ఇచ్చి డబ్బులు సంపాదిస్తున్నాడు. ఈ కిడ్నీ మార్పిడికి లక్ష్మణ్ తో పాటు ప్రధాన సూత్రధారి పవన్ అలియాస్ లియోన్ కీలక పాత్రను పోషించాడు. పవన్ తన అనుచరులైన పూర్ణ తో కలిసి కిడ్నీ మార్పిడికి సంబంధించిన వైద్య చికిత్సలు చేసే తమిళనాడుకు చెందిన డాక్టర్ శేఖర్ పెరుమాల్, జమ్మూ కాశ్మీర్ కు చెందిన డాక్టర్ డాక్టర్ షోయబ్, తమిళనాడు, కర్ణాటక కు చెందిన ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ లు శంకర్, ప్రదీప్, సూరజ్ లతో ముఠాను ఏర్పాటు చేశారు. ఈ ముఠా సభ్యులు డోనర్ లతో పాటు కిడ్నీలు అవసరమున్న వారిని ఒక దగ్గరకు చేర్చి ఒక కిడ్నీ మార్పిడి కోసం రూ.55 నుంచి 60 లక్షల రూపాయాలను వసూలు చేస్తూ అక్రమంగా కిడ్నీలను మారుస్తున్నారు.



### 2024 జూలై నుంచి అలకనంద హాస్పిటల్ లో 20 కిడ్నీలు మార్పిడి

2024 జూన్ లో అవినాష్ జనని హాస్పిటల్ ను మూసేసిన తర్వాత సరూర్ నగర్ లోని అలకనంద హాస్పిటల్ ను నిర్వహిస్తున్న సుమంత్ ను కలిసాడు. కిడ్నీ మార్పిడికి అపరేషన్ థియేటర్ ను అద్దెకు ఇస్తే రూ.1.50 ఇస్తానని తనకు లక్ష మిగులుతుందని చెప్పి ఒప్పించాడు. సుమంత్ ఈ ప్రతిపాదనకు ఒప్పుకోవడంతో అలకనంద హాస్పిటల్ లో జూలై నుంచి ఇప్పటివరకు మొత్తం 20 కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ చికిత్సలు జరిగాయని, పోలీసులు తమ దర్యాప్తులో నిర్ధారించారు. అక్రమ కిడ్నీ మార్పిడి చికిత్సలు జరుగుతున్నాయని జిల్లా వైద్య అధికారి నుంచి రాచకొండ పోలీసులకు ఫిర్యాదు రావడంతో రంగంలోకి దిగిన ఎస్ఓటీ, సరూర్ నగర్ పోలీసులు, మెడికల్ ఆఫీసర్ లతో కలిసి అలకనంద హాస్పిటల్ లో తనిఖీ చేసినప్పుడు డోనర్ లు నస్రీన్ భాను, ఫిరోస్, కిడ్నీ పొందిన రోగులు రాజశేఖర్, భరత్ ప్రభలను గుర్తించారు. వారిని విచారించిన తర్వాత ఈ నెల 23న అలకనంద హాస్పిటల్ ఎండి, డాక్టర్ సుమంత్, ఎన్ గోపీలను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. విచారణలో శనివారం జనని హాస్పిటల్ ఎండి డాక్టర్ అవినాష్, ప్రదీప్, రమావత్ రవి, రవీందర్, హారీశ్, పి.సాయి, సూరజ్ మిశ్రాలను అరెస్టు చేశారు. పవన్, లక్షణ్ లతో పాటు మరో నలుగురు పరారీలో ఉన్నారు. అవినాష్ జనని, అరుణ హాస్పిటల్స్ లో ఎన్ని అక్రమంగా కిడ్నీలు మార్పిడి చేశారని తదుపరి విచారణలో తేలుతుందని పోలీసులు తెలిపారు.

# శ్రీశ్రీశ్రీ మమ్మాయమ్మా దేవాలయ అభివృద్ధికి కృషి

### ఆలయ చైర్మన్ గా చనమోని సత్యనారాయణ



**ఇబ్రహీంపట్నం, జనవరి 25 మహా:** శ్రీశ్రీశ్రీ మమ్మాయమ్మా దేవాలయ నూతన కమిటీ చైర్మన్ గా చనమోని సత్యనారాయణ నియామకం. ఇబ్రహీంపట్నం మండలం, మంగళపల్లి గ్రామంలోని, శ్రీశ్రీశ్రీ మమ్మాయమ్మా దేవాలయానికి నూతన కార్యవర్గంలో ఐదుగురు సభ్యులను నియమించిన రంగారెడ్డి జిల్లా తూర్పు డివిజన్ దేవాదాయ శాఖ అధికారులు. శుక్రవారం నూతన కమిటీ చైర్మన్ గా చనమోని సత్యనారాయణ, కమిటీ సభ్యులు గజ్జల సంతోష్ కుమార్, ఎదుల్ల నరసమ్మ, వట్నాల వెంకటేష్, కీలుకత్తి శ్రీనివాస్ గౌడ్ తో కలసి ప్రమాణ స్వీకారం చేయించడం జరిగింది. అనంతరం అధికారులు సభ్యులకు నియామక పత్రం అందజేశారు. ఆలయ చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ... పవిత్రమైన ఆలయాన్ని మరింత అభివృద్ధి చెందేలా రూపొందిస్తామని, భక్తులకు ఎల్లవేళలా సేవలందించే విధంగా చూస్తామని, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా తెలిపారు. మా యొక్క నియామకానికి సహకరించిన స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, మరియు గ్రామ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.